J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 43 28.03.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

పాఠకులకు, ప్రకటనకర్తలకు, మిత్రులకు, చందాదారులకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు సం/-

# దివాలా దిశగా తెలుగు రాష్ట్రాలు

- ఇద్దరు ముఖ్యమంత్రుల బీద అరుపులు
- అప్పు కూడా పుట్టడం లేదంటూ గగ్గోలు
- విభజనతో ఆంధ్ర - తెలంగాణ వీధిన పడ్డాయా?
- జీతాలు, పెన్షన్లు కూడా గగనమేనా?

2లో


## గత పాలకుల పాపమే...
## శాపమైందంటున్న చంద్రబాబు, రేవంత్‌రెడ్డి









శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి గారు

జననం : 15.10.1944 మరణం : 23.03.2020

# ఐదవ వర్ధంతి

అవధులు లేని మీ ప్రేమానురాగాలు సదా స్మరణీయం
అనితరసాధ్యమైన మీ భక్తితత్వం సదా ఆచరణీయం
అజరామరమైన మీ కీర్తి చిరస్మరణీయం

మాకు స్ఫూర్తిప్రదాత, మా కుటుంబ అభివృద్ధికి బంగారు బాటలు వేసిన విధాత

**కీ॥శే॥ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి గారి**

5వ వర్ధంతి (29.03.2025 తిథుల ప్రకారం)
సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

**ఆల్తూరు సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు

**ఆల్తూరు గిరీష్‌రెడ్డి - లత**
**ఆల్తూరు మహేష్‌రెడ్డి - రాధిక**

మనుమరాళ్ళు, మనుమళ్ళు

**సాహిని - అనురాగ్**
**సాయి సంతోష్, సాయి నితీష్ - కీర్తి,**
**సాయి అనీష్**

# యువతా!..క్యాన్సర్‌తో జాగ్రత్త!

**అపోలో వైద్యుల సూచన**

నేటికాలంలో యువతకు ఎక్కువగా కొలరెక్టల్ క్యాన్సర్ వస్తోందని, కనుక యువతీయువకులు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరులోని అపోలో వైద్యుల బృందం సూచిస్తోంది. ముందుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, సకాలంలో చికిత్స తీసుకుంటే కొలరెక్టల్ క్యాన్సర్ (పెద్దప్రేగు సంబంధ క్యాన్సర్)ను జయించ వచ్చునని ఆ వైద్యనిపుణులు చెప్తున్నారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ ఇటీవల నెల్లూరులోని కొలరెక్టల్ క్యాన్సర్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆ ఆసుపత్రికి చెందిన ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ హరిత, ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాల జిస్టు డాక్టర్ నితీష్ కుమార్‌రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ హిమబిందు తదితరులు కొలరెక్టల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిం చారు. ఆధునిక జీవనశైలి కారణంగా ఇటీవల ఎక్కువగా ఈ రకమైన క్యాన్సర్ యువతకు సోకుతుండటం విచారకరమన్నారు. యువత ఆధునిక పోకడలకు అలవాటు పడకుండా, ఆరోగ్యకర



మైన జీవనశైలిలో ఉంటే, ఇలాంటి క్యాన్సర్లకు దూరంగా ఉండ వచ్చునని చెప్పారు. పెద్దప్రేగులోని ఏదో ఒక భాగంలో పుండుగా ఈ క్యాన్సర్ ప్రారంభమవుతుందని, మలంలో రక్తం రావడం, ఎక్కువగా బరువు తగ్గిపోవడం, నిరంతరం కడుపు నొప్పిగా ఉండటం, వాంతులు అవుతుండటం ఈ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని సూచించారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో కూడా కొలరెక్టల్ క్యాన్సర్‌కు అధునాతన పద్ధతుల్లో చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈదూరు.. కోదండరామస్వామి దేవస్థానంలో

# 30 నుంచి.. వసంత నవరాత్రి వేడుకలు



తోటపల్లిగూడూరు మండలం ఈదూరు గ్రామంలో కొలువైవున్న హనుమత్ లక్ష్మణ సీత సమేత శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఈనెల 30న 'విశ్వావసు' ఉగాది రోజు నుంచి ఏప్రిల్4వతేదీ వరకు వైభవంగా స్వామివారి వార్షిక వసంతి నవరాత్రి మహోత్సవాలు, శ్రీ అభయాంజనేయస్వామికి విశేష పూజలు జరుగనున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రావి మోహన్‌చౌదరి సారథ్యంలో జరిగే ఈ వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 3న శ్రీ అభయాంజనేయస్వామివారికి విశేష పూజలు, 6న శ్రీరామనవమి రోజున కల్యాణోత్సవం, గరుడసేవ ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహిస్తారు. ఏప్రిల్ 7న ఉదయం పట్టాభిషేక మహోత్సవం, రాత్రికి గజవాహన సేవ, 8న గంధపడి ఉత్సవం, రాత్రికి ఏకాంత సేవ వైభవోపేతంగా ఉంటాయని, భక్తులంతా పాల్గొని స్వామివార్ల కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

# దివాలా దిశగా తెలుగు రాష్ట్రాలు

(మొదటిపేజీ తరువాయి)

***"ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. ఇప్పట్లో కోలుకోవడం కష్టమే. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉంది. దానికి ఊపిరిలూదడం శక్తికి మించిన పనిలా కనిపిస్తోంది. గత ఐదేళ్ళలో ఆదాయం లేదు. సంపద పెరగలేదు, ఉన్న ఆస్తులను తాకట్టుపెట్టేశారు. ఆర్థిక విధ్వంసానికి పాల్పడ్డారు. అయినా కాలూ చేయి కూడదీసుకుని కునారిల్లుతున్న ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజలు కూడా అర్థం చేసుకోవాలి."...*** ఇదీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన.

***"నయాపైసా డబ్బుల్లేవ్, ఏం చేయాలో మీరు చెప్పండి. మొత్తం లెక్క మీకు చెప్తాను ఉన్న నిధులను దేనికి తగ్గించాలో, దేనికి పెంచాలో, ఎవరికి పంచాలో మీరే చెప్పండి. ప్రజలకి, చట్టసభలకి అబద్ధాలు చెప్పలేక ఉన్నది ఉన్నట్లు ప్రజల ముందు పెడుతున్నా, గత పదేళ్ళలో దోపిడీ దొంగలు రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టారు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఎన్ని ప్రయత్నాలుచేసినా ఎక్కడా అప్పు కూడా పుట్టడం లేదు. మన ఆర్థిక పరిస్థితి బాగుంది అని చెప్పడం అంటే, క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగికి, సిక్స్‌ప్యాక్ బాడీ ఉన్నట్లు అబద్ధం చెప్పడమే అవుతుంది."...*** ఇదీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్వేదం.

ఎన్నో పోరాటాలు, మరెన్నో ఆందోళనల మధ్య విడిపోయిన తెలుగు రాష్ట్రాలు, అభివృద్ధిలో ఆకాశాన్ని అందుకుంటాయనుకుంటే, ఆర్థిక వ్యవస్థలే కుప్పకూలి పోయాయి అనేలా పాలకులు బీద అరుపులు అరుస్తుండడం విశ్లేషకులనే కాదు, సాధారణ ప్రజలని సైతం విస్మయానికి గురి చేస్తోంది.

### దినదిన గండంగా..

ఓ వైపు సంక్షేమ పథకాలు, మరోవైపు ప్రాజెక్టులు, ఇంకోవైపు కొత్తహామీలు, ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి, ఏ ప్రభుత్వానికైనా ఇవే ప్రాథమిక బాధ్యతలు. వీటితోడు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, పేరుకుపోతున్న బకాయిల బాధలు కూడా తప్పవు. వీటన్నింటికీ ముక్కీ మూలిగి నిధులు సమకూర్చుతూనే శాంతిభద్రతలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంటుంది. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక మంత్రులు 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఏడాది కాలానికి సంబంధించి ఆదాయ వ్యయాలు, నిధుల కేటాయింపులపై స్పష్టత ఇచ్చారు. భవిష్యత్ ప్రణాళికలను కూడా తెలియజేశారు. ఇరు రాష్ట్రాల్లోనూ రూ.3 లక్షల కోట్లకు అటూఇటుగా వార్షిక పద్దును తెలియజేశారు. హామీలన్నీ అమలు చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం కేటాయింపుల్లో జాగ్రత్తలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే, ప్రస్తుతం తమ చేతుల్లో చిల్లిగవ్వ లేకుండా పోయిందని, గత పాలకుల పాపం వల్ల తమ రాష్ట్రానికి ఈ పరిస్థితి దాపురించిందని, విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర పాలనా బాధ్యతలను భుజాన మోస్తున్నామని ప్రస్తుత ప్రభుత్వాల అధినేతలిద్దరూ వాపోతున్నారు. కొత్త కోర్కెల చిట్టాలు తమ వద్దకు తీసుకురావొద్దని, కాస్ట్ కటింగ్‌కు ఉన్న అన్ని మార్గాలనూ పరిశీలించాలని అధికార గణానికి హితబోధ చేస్తున్నారు. పనిలో పనిగా ఉన్న వాస్తవాలను ప్రజలకు వివరించి పారదర్శకంగా వ్యవహరించే ప్రయత్నం చేస్తున్నామంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు.

### ఏపీలో శ్వేతపత్రాలతో మొదలై..

2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బంపర్ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి హోదాలో పాలనా పగ్గాలు చేపట్టారు. అంతవరకు బాగానే ఉన్నా, పాలన ప్రారంభంలోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల పాలైందంటూ, అన్ని ప్రభుత్వ శాఖలు నిర్వీర్యమై పోయాయంటూ 7 శ్వేతపత్రాలను విడుదల చేశారు. ఆయా శాఖల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితిని తెలియజేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గత ఐదేళ్ళ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వల్ల రాష్ట్రం అథోగతి పాలయ్యిందని ఆరోపించారు. ఫలితంగా రాష్ట్రం మరో 40 ఏళ్ళు వెనుకబడి పోయిందనేలా పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఇప్పుడున్న దురావస్థ ఎప్పుడూ లేదని, కఠిన సవాళ్ళు తప్పడం లేదని ఇప్పటికీ ఆవేదన వ్యక్తం చేస్తూనే వున్నారు.

### గత ఐదేళ్ళలో...

### అప్పుల ఆంధ్రగా మార్చేశారు

తొమ్మిదోసారి ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టే అరుదైన భాగ్యం పొందడం ఆనందంగానే ఉన్నా, రాష్ట్ర పరిస్థితి మనసును కలిచివేస్తోందని చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా వాపోయారు. 2019 మార్చి 31 తమ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పులు రూ.3.75 లక్షల కోట్లుగా ఉన్నాయని ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి (2024 జూన్ 12వ తేదీకి) రాష్ట్ర అప్పులు 9.74లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆయన ఆరోపించారు. అదే సమయంలో రాష్ట్రంలో కార్పొరేషన్ రుణాలు 2.48 లక్షల కోట్లు, విద్యుత్‌రంగంలో బకాయిలు సుమారు 34వేల కోట్లు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు సుమారు 22 వేల కోట్లుగా ఉన్నాయని, వీటినన్నింటినీ చెల్లించాల్సిన బాధ్యత ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై పడిందని, ఈక్రమంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం కత్తిమీద సాముగా మారిందని అంటున్నారు.

ఇక జగన్ కేంద్ర ప్రభుత్వం జాతీయ పథకాలకు ఇచ్చిన సొమ్మును కూడా ఇష్టారాజ్యంగా ఖర్చుచేయడం వల్ల దాదాపు 93 కేంద్ర పథకాలకు డబ్బులు విడుదల కావడం లేదని, వాటిలో 73 పథకాలకు సంబంధించిన బకాయిలను కూటమి ప్రభుత్వమే చెల్లించి పునరుద్ధరించే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఒక్కమాటలో చెప్పాలంటే నవ్యాంధ్ర ప్రజల ఆశలను, ఆశయాలను, ఆస్తులను జగన్ ఆవిరి చేశారని, అమరావతిని శ్మశానం చేసేందుకు యత్నించారని, డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేసి పోలవరం కలనే చిదిమేసే కుట్రలు పన్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ మూసివేతకు సహకరించారని, కొత్తరేవ్జోన్‌కు కనీసం భూమికూడా కేటాయించకుండా రాష్ట్రాన్ని అథోగతి పాలు జేసేందుకు శతవిధాలా ప్రయత్నించారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

అయినా కేంద్రం సహకారంతో, తనకున్న అనుభవంతో, పారిశ్రామికవేత్తలు, ప్రజల మద్దతుతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని, విజన్ 2047 లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, జీడీపీ వృద్ధి, తలసరి ఆదాయం పెరుగుదలతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచేందుకు టాటా, మైక్రోసాఫ్ట్ సంస్థలతో, బిల్‌గేట్స్ వంటి దిగ్గజాలతో చర్చించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊపిరిలూదే ప్రయత్నం చేస్తున్నామని, అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై కూడా దృష్టి సారిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేస్తున్నారు. సూపర్ సిక్స్ అమలు కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నామని, ఒక్కొక్కటిగా అమలుచేసే క్రమంలో ప్రజలు తమ ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరుతున్నారు. దీనికి కొనసాగింపు అన్నట్లుగా దేశంలో అప్పుపుట్టని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌లో పేర్కొనడం గమనార్హం.

అయితే, ప్రతిపక్షం మాత్రం దొంగ హామీలతో గద్దెనెక్కి ఇప్పుడు నాటకాలాడే ప్రయత్నం చేస్తున్నారని, ఇచ్చిన హామీలను అమలుచేసే విషయంలో చంద్రబాబు రెండునాల్కల ధోరణి అవలంభిస్తున్నారని, పాలన చేతకాక ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టేసే ప్రయత్నం చేసున్నారని ఆరోపిస్తున్నారు. 2014-19 మధ్య అమరావతి పేరుతో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి ఆంధ్రాను అప్పుల పాలు జేసింది చంద్రబాబే అని, కమీషన్ల కక్కుర్తితో పట్టిసీమకు నిధులు కేటాయించి పోలవరం నిర్మాణాన్ని మరింత ఆలస్యం చేశారని విమర్శల బాణాలు సంధిస్తున్నారు.

### తెలంగాణ ధనిక రాష్ట్రంగా మొదలై

ఆంధ్రాలో పార్టీని పణంగాపెట్టి మరీ, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఎట్టకేలకూ దశాబ్దం తర్వాత అక్కడ అధికారంలోకి వచ్చింది. అయితే, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రంగా ప్రస్థానం ప్రారంభించిన తెలంగాణ ప్రస్తుతం అప్పులకుప్పగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత పదేళ్ళ కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నాయకులు తమ అభివృద్ధి కోసం రాష్ట్ర అభివృద్ధిని తాకట్టుపెట్టారని, కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 1.50 లక్షల కోట్లను 11 శాతం వడ్డీరేటుకు తెచ్చి రాష్ట్ర ఆదాయాన్ని ఇతర సంస్థలకు దోచిపెట్టే ప్రయత్నం చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. వరల్డ్ బ్యాంక్, ఏడీబీ బ్యాంకులు 3 నుంచి 4 శాతం వడ్డీరేటుకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా కేసీఆర్ తన కమీషన్ల కోసం ఇతర సంస్థల నుంచి రుణాలు తెచ్చారని, అదే సమయంలో మిషన్ భగీరథ వంటి పథకాల్లోనూ అవినీతి తాండవించిదని.. ఫలితంగా రాష్ట్ర అప్పులు రూ.8.29 లక్షల కోట్లకు చేరుకున్నాయని రేవంత్ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకి గత ప్రభుత్వం 8 వేల కోట్ల దాకా బకాయిలు పెట్టిందని, వాటిని ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై పడిందని మండిపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి నెలకు సరాసరి 18వేల కోట్ల ఆదాయం వస్తుండగా, అందులో అప్పుల చెల్లింపు కోసం ఆరున్నర వేల కోట్లు, జీతాలు, పింఛన్ల కోసం మరో ఆరున్నర వేల కోట్లు ఖర్చువుతున్నాయని, మిగిలిన మూడు నాలుగు వేల కోట్లతోనే రాష్ట్ర రోజువారీ అవసరాలు, అభివృద్ధి పథకాలను ముందుకు తీసుకెళ్లాల్సి వస్తోందని వాపోయారు. రిజర్వ్‌బ్యాంక్ అప్పిస్తేకానీ ప్రతినెలా ఉద్యోగులకి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు నానా యాతన పడాల్సి వస్తోందని, అబద్ధాల పునాదులపై పాలన నడిపించే ఉద్దేశం లేక ప్రజల ముందు అన్ని విషయాలను వెల్లడిస్తున్నానంటూ తేల్చిచెప్పారు. దీంతో గ్యారెంటీల అమలుపై నీలినీడలు కమ్ముకునే పరిస్థితి నెలకొందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఇద్దరూ... ఇద్దరే...!

ఏదేమైనా విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తీవ్ర సంక్షోభానికి గురవుతున్నాయన్నది కాదనలేని సత్యం. నాయకుల పాపాలో, ప్రజల దురదృష్టమో ఉమ్మడి రాష్ట్రం ముక్కలైంది. కనీసం కలిసి ఉంటే అయినా ఇంతటి దుర్భిక్ష పరిస్థితులు నెలకొనేవి కావేమోనని, సగటు తెలుగుబిడ్డ ఆవేదన వెలిబుచ్చే పరిస్థితి రావడం దౌర్భాగ్యమే.

ఇక డబుల్ ఇంజన్ సర్కారు ఉండడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు కొంతమేర కేంద్రం సహాయం లభించే అవకాశం ఉన్నా, తెలంగాణకు మాత్రం ఆ సౌలభ్యం కూడా లేకపోవడం నష్టదాయకమే. పరిస్థితులు ఎలా ఉన్నా... ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే మాత్రం ప్రజలు నాయకుల కీలెరిగి వాతపెట్టడం మాత్రం తథ్యం.

అయితే, అభివృద్ధి-సంక్షేమ పథకాల విషయంలో కూనిరాగాలు తీస్తూ అప్పుల చిట్టా వల్లించడంలో ఇద్దరూ ..ఇద్దరే అన్నట్లుగా రెండు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రవర్తిస్తున్నారు. వీరి మాటలూ, పోకడా చూస్తుంటే... దివాలా దిశగా తెలుగు రాష్ట్రాలు ఉన్నాయా...? అన్న అనుమానం సామాన్యులని కూడా వేధిస్తుందని విశ్లేషకులు చెప్పడం కొసమెరుపు!...

# జమిలి ఎన్నికలు.. మంచిదే! - సోమిరెడ్డి



జమిలి ఎన్నికలు మంచివేనని, దాని వల్ల దేశానికి ఎన్నో ప్రయోజనాలున్నాయని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అంశంపై ఇటీవల స్థానిక విక్రమసింహపురి యూనివర్సిటీలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువకులు కూడా తమ సత్తాచాటి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. మన రాష్ట్రంలో 175 మంది యువతతో యువజన అసెంబ్లీ నిర్వహించే సన్నాహాల్లో యువమంత్రి నారా లోకేష్‌బాబు కృషిచేస్తున్నారని ఆయన తెలిపారు. 1950 ప్రాంతాల్లో దేశ వ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగేవని, ఆ తర్వాత కాలంలో పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలిపోయి మధ్యంతర ఎన్నికలు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా మారిపోయిందని చెప్పారు. పార్లమెంటు ఎన్నికలు జరిగిన తర్వాత ఏటా ఏదో ఒక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు వస్తూనే ఉన్నాయని, ఎన్నికల షెడ్యూల్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఫలితాలు వచ్చి కొత్త ప్రభుత్వం ఏర్పడేంత వరకూ కొత్త నిర్ణయాలు ఉండవు, నిధుల కేటాయింపు ఉండదు.. ఫలితంగా కీలక సమస్యల పరిష్కారానికి అవాంతరం ఏర్పడుతుందని ఆయన వివరించారు. ఎన్నికల కారణంగా పరిపాలనకు అవాంతరాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం జమిలి ప్రతిపాదనను తెచ్చిందని, మొత్తమ్మీద జమిలి ఎన్నికలు మంచివేనని అన్నారు. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం 24 పీహెచ్‌డీలు పొందిన విద్యావేత్త అల్లం శ్రీనివాసరావును ఈ యూనివర్సిటీకి వీసీగా నియమించడం శుభ పరిణామమన్నారు.

# అబుదాబీలో.. సతీష్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, డిఆర్‌డిఓ మాజీ ఛైర్మెన్ డా. గుండ్రా సతీష్‌రెడ్డి మార్చి 25, 26 తేదీలలో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లోని అబుదాబీలో పర్యటించారు. భారతదేశం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పారిశ్రామిక పెట్టుబడులు, దేశంలోని ఇతర సంస్థలతో పరస్పర ఒప్పందాలు, తదితర అంశాలపై ఆయన స్థానిక మంత్రులతో, మేధావులతో, పారిశ్రామిక, విద్య, వైద్య రంగాల ప్రముఖులతో, పలు విభాగాల శాస్త్రవేత్తలతో చర్చించారు.

# బీద రవిచంద్రకు.. కోటంరెడ్డి సత్కారం!



ఇటీవల ఎమ్మెల్సీగా రెండోసారి పదవి చేపట్టిన బీద రవిచంద్రను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరులు ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు.. పార్టీకి అండగా ఉంటూ, కార్యకర్తలకు సహకారం అందిస్తూ, పార్టీ బలోపేతం అయ్యేందుకు రవిచంద్ర ఎంతో కృషిచేశారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. రవిచంద్ర ఎమ్మెల్సీ కావడం పార్టీ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం కలిగించిందన్నారు. అనంతరం, బీద రవిచంద్ర మాట్లాడుతూ, శ్రీధరన్నతో తనకు 35ఏళ్ళ అనుబంధం ఉందని, పార్టీ కార్యకర్తలకు భరోసా కలిగించే విషయంలో నెల్లూరు రూరల్ మొదటిస్థానంలో ఉందని ప్రశంసించారు. రూరల్‌లో కోటంరెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అంటూ, పొట్టేపాళెం, ములుముడి కలుజులపై వంతెనల నిర్మాణానికి కృషిచేస్తానని రవిచంద్ర చెప్పారు.

# కోవూరు చక్కెర ఫ్యాక్టరీ కార్మికులకు తీపివార్త

## బకాయిలు చెల్లింపునకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్

జిల్లాలో చాలాకాలంగా మూతబడి ఉన్న కోవూరు చక్కెర కర్మాగారం సమస్య ఒక కొలిక్కివస్తోంది. కార్మికులకు బకాయిలు చెల్లించాలని కూడా ముఖ్యమంత్రి చెప్పడంతో, కార్మికులకు తీపివార్త అందినట్లయింది. ఇంతకాలం కొరుకుడుపడని విధంగా ఉన్న ఈ సమస్యలను, కూటమి ప్రభుత్వం వచ్చాక కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల కార్మికుల కష్టాలను అసెంబ్లీలో వినిపించారు కూడా. అందుకు తగ్గట్టుగా బుధవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ ఫ్యాక్టరీ సమస్యలను కలెక్టర్ వివరించడం, మంత్రి పొంగూరు నారాయణ కూడా బకాయిల విషయం చెప్పడం జరిగాయి. దీంతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ఆ ఫ్యాక్టరీకి సంబంధించిన బకాయిలను చెల్లించి, ఫ్యాక్టరీ స్థలాన్ని ఎపిఐఐసీకి అప్పగించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ కూడా ఈ ఫ్యాక్టరీకి సంబంధించి చక్కెర రైతులు, కార్మికులకు రూ. 28 కోట్లు బకాయి ఉన్నారంటూ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన సీఎం..ఆ బకాయిలు చెల్లించి, పరిశ్రమల స్థాపనకు భూమిని ఎపీఐఐసికి అప్పగించాలని జిల్లా ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ను ఆదేశించడం కార్మికులకు, రైతులకు ఊరట కలిగిస్తోంది.

# పార్లమెంట్ పీఏసీ సభ్యునిగా.. మాగుంట శీనయ్య



ఒంగోలు టీడీపీ ఎంపీ మాగుంట శీనయ్యకి మరో అరుదైన గౌరవం లభించింది. పార్లమెంటు పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ సభ్యులుగా ఇటీవల ఆయన ఎన్నికయ్యారు. ఆయనతో పాటు, ఆంధ్రప్రదేశ్ కు చెందిన అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, మచిలీపట్నం జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరిలు కూడా పీఏసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆ కమిటీలోని 15 స్థానాలకు జరిగిన ఎన్నికకు మొత్తం 22 మంది సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఏడుగురు సభ్యులు పోటీ నుంచి తప్పుకోవడంతో, మిగిలిన 15 మంది సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.







లాయర్
మార్చి 28, 2025

# విద్యార్థుల ఆత్మహత్యలపై 'సుప్రీం' ఆందోళన!

దేశంలో నానాటికీ పెరిగిపోతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై భారత అత్యున్నత న్యాయస్థానం..'సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు తరచూ ఆత్మహత్యలకు పాల్పడుతుండడంపై 'సుప్రీం' మానవీయ హృదయంతో స్పందించింది. అంతేకాదు, ఆ బలవన్మరణాలను ఎలాగైనా సరే ఆపాలన్న లక్ష్యంతో..జాతీయస్థాయిలో ఒక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటుచేయాలని నిర్ణయించడం విద్యార్థిలోకానికి ఊరట కలిగిస్తోంది. విద్యావిధానంలో వస్తున్న రకరకాల వత్తిడులు, విద్యార్థుల మానసిక ఆరోగ్యం తదితర సమస్యల నివారణకు టాస్క్‌ఫోర్స్ ఉండాలని భావిస్తూ, సుప్రీం ధర్మాసనం ఆమేరకు నిర్ణయం తీసుకోవడం హర్షదాయకం. వాస్తవ పరిస్థితుల అధ్యయనానికి, అవసరమైతే దేశంలోని ఎలాంటి ఉన్నత విద్యాసంస్థలోనైనా సరే, ఆకస్మిక తనిఖీలు చేసేందుకు టాస్క్‌ఫోర్స్‌కు అధికారం ఉండేలా 'సుప్రీం' కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుండడం విశేషం!

మనదేశంలో ఎంతోకాలంగా అనేకరకాల కారణాలతో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయే తప్ప తరగడమే లేదు. ఇటీవలి కాలంలో విద్యార్థులు ఆత్మహత్యల సంఖ్య పెరిగి పెరిగి లక్షకి పైగానే దాటిందని గణాంకాలు చెప్తున్నాయి. చిన్నచిన్న విషయాలకే జీవితంపై విరక్తి పుట్టి ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్న విద్యార్థులెందరో ఉన్నారు. ఈ దుర్మరణాలు అటు కుటుంబ వ్యవస్థకే కాదు, సమాజానికే నష్టదాయకం కూడా. మరోవైపు, ఉన్నత విద్యాసంస్థల్లో లక్షలు ఖర్చుపెట్టి చేర్పినా..ఏ కారణం వల్లనైనా తమ బిడ్డలు బలవన్మరణాల పాలైతే, ఆ తల్లితండ్రులు జీవితాంతం పడే వేదన అంతా ఇంతా కాదు. అందుకే, సుప్రీం ధర్మాసనం ఆ విషయాలన్నిటినీ సమగ్రంగా మదింపు చేసి, ఆ మేరకు నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం. వాస్తవానికి జీవితమంటే వడ్డించిన విస్తరేమీ కాదు. జీవితం కొందరికి పూలబాట కావచ్చేమో కానీ.. అందరికీ మాత్రం కాదు. సమాజంలోనూ, కుటుంబంలోనూ విద్యార్థులను అనేక సమస్యలు, పరిస్థితులు ప్రభావితం చేస్తుంటాయి. పెరిగిపోతున్న పేదరికం, ఆర్థిక బాధలు, నిరుద్యోగం సమాజాన్ని అన్ని విధాలా అధోగతి పాలుచేస్తున్న నేటి సంక్లిష్ట పరిస్థితుల్లో, విద్యావ్యవస్థ కూడా అస్తవ్యస్తంగానే ఉంటోంది. ఎక్కడ చూసినా.. అంతా అరాచకంగా తయారవుతోంది. యాజమాన్యాలు మాత్రం నిర్లక్ష్యంగానే ఉంటుండడం మామూలైపోయింది. ఉన్నత విద్యలు చదువుకుంటున్నవారు కూడా లేనిపోని క్షణికావేశానికి గురికావడం, చీటికీమాటికీ అలగడం, కోపం తెచ్చుకోవడం, చిన్న సమస్యలను కూడా భూతద్దంలో చూసి భయపడిపోతుండడం, ఒంటరితనానికి, కుంగుబాటుకు గురవుతుండడం, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతుండడం వంటి సంఘటనలను మనం తరచూ చూస్తూనే ఉన్నాం. గొప్ప పేరున్న విద్యాసంస్థల్లో చదువుకుంటున్నవారు, దూరప్రాంతాల్లో ఎక్కడో హాస్టళ్లలో చదువుకుంటున్నవారు కూడా రకరకాల వత్తిడులతో అవస్తలు పడుతూనే ఉంటారు. చదువుకోవడమంటే మార్కులు బాగా తెచ్చుకోవడం, ర్యాంకులు సాధించడమే ధ్యేయమనుకునే నేటి విద్యావ్యవస్థలో, ఒకవేళ ఆశించిన మార్కులు రాకపోతే జీవితమే వృధా అనుకునే దుస్థితికి చేరిపోతున్నారు. ఆ పరిస్థితులను తట్టుకోలేక హాస్టల్ భవనాల మీదినుంచి పడిపోయి ఆత్మహత్య చేసుకోవడం, లైంగిక వేధింపులు, ప్రేమ విఫలమవడాలు..కులమతాల వివక్షలు వంటి ఇతరత్రా కారణాల వల్ల కూడా బలవన్మరణాలకు పాల్పడుతుండడం దురదృష్టకరం. విద్యార్థులను అటు తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యాసంస్థల యాజమాన్యాలు ఎప్పటికప్పుడు కంటికి రెప్పల్లా కాపాడు కోవాలే తప్ప, వారి మానాన వారిని వదిలేస్తే.. చివరికిలా ప్రాణాలే పోతుంటాయి. ఇకనైనా ఈ దుస్థితి పోవాలి. ఎన్ని కష్టాలెదురైనా సరే, ధైర్యంగా బతికే ఆత్మస్థైర్యాన్ని విద్యార్థుల్లో కలిగించాలి. అందులోనూ, విద్యార్థి దశే భావిజీవితానికి ఎంతో కీలకం. ఆ వయసులోనే మంచి లక్ష్యాలను నిర్దేశించు కుని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మార్గం వేసుకోవాలే కానీ, ఏ కారణంతోనైనా సరే.. జీవితాలను చీకటి మయం చేసుకోకూడదు. అందుకనే ఎక్కడో ఒక చోట ఈ ఆత్మహత్యలకు ఫుల్‌స్టాప్ పడాలి.

ఈ నేపథ్యంలో 'సుప్రీం' తీసుకుంటున్న నిర్ణయాలు విద్యార్థుల బలవన్మరణాల నిరోధానికి.. వారి ఉజ్వల భవితవ్యానికి బాసటగా ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు!. అందుకు తోడుగా పాలకులు, ప్రభుత్వాలు, ప్రజలు కూడా సహకరిస్తే.. ఆ నిర్ణయాలు మరింత వేగవంతంగా సఫలీకృతమవుతాయని ఆశించవచ్చు!..




# అక్రమాలకు అడ్డాగా.. 'పనికి ఆహార పథకం'!

"పనికి ఆహార పథకం" పేదవారి కోసం ఆవిర్భవించిన ప్రభుత్వ పథకం. దీనిని "ఉపాధి హామీ పథకం"గా కూడా పిలుస్తారు. కూటికి నోచుకోని నిరుపేదలు, కూలిపనులు చేసుకొని పొట్ట పోషించుకునే కష్టజీవుల కుటుంబాల కోసం ప్రారంభించబడింది ఈ బృహత్తర పథకం. పేదవారు ఆకలికి అల్లాడకుండా, వారికి పనికల్పించి, తగు ఉపాధినివ్వాలనే సదుద్దేశ్యంతో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే "ఫుడ్ ఫర్ వర్క్". ఈ పథకాన్ని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ–NREG) పేరుతో సుమారు ఇరవై ఏళ్ళ క్రితం కేంద్రం మొదలుపెట్టింది. అయితే, ఇది నిజంగా పేదవాడి కడుపు నింపుతుందా..? లేక మధ్యవర్తుల జేబులు నింపుతుందా అన్నది ప్రశ్నార్థకమే.

ప్రభుత్వ పథకాల నిధులను కోట్లకు కోట్ల రూపాయలు ..దర్జాగా ఎలా తినేయొచ్చో తెలుసుకోవాలంటే, 'ఉపాధి హామీ' పథకం ఒక్కదానిని క్షుణ్ణంగా పరిశీలిస్తే చాలు. దీనిని అమలుచేసే అధికారులు, సిబ్బందే ఆ పథకాన్ని నిలువుదోపిడీ చేస్తుండడం ఈ పథకం ప్రత్యేకత. చూసేవాళ్ళు, అడిగేవాళ్ళు లేరన్నట్లుగా, దొరికింది దొరికినట్లుగా మెక్కేసే అక్రమార్కులకి, అవినీతి తిమింగిలాలకి ఈ పథకం పెద్ద వరంగా మారిందంటే అతిశయోక్తి కాదు. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం' (నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటి 'NREG') మనదేశంలోని అనేక రాష్ట్రాల్లో గాడి తప్పి, అక్రమార్కులకి ఆదాయ వనరుగా మారడం విచారకరం.

ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకానికి చిల్లులు కాదు కదా.. ఏకంగా పెద్ద బొక్కలే పెట్టేసి, సంబంధిత అధికారులు, సిబ్బందే కోట్లరూపాయలు బొక్కేశారన్న వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారం చేతిలో ఉందికదా అని, గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని అడ్డం పెట్టుకుని అక్రమార్కులంతా ఒక్కటై అడ్డగోలుగా దోచేసుకున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వ పరిశీలనలో అనేక ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. ప్రభుత్వం నుండి పేదోడికి ఓ పది రూపాయలు రావాలంటే సవాలక్ష నిబంధనలుంటాయి. కానీ, పేదోళ్ళకిచ్చే ఇలాంటి పథకాలను అడ్డంపెట్టుకుని కోట్లల్లో దోచుకునేవారికి అలాంటివేమీ వర్తించవనడానికి దర్జాగా, నిర్లజ్జగా కొనసాగిన ఈ దోపిడీయే పెద్ద నిదర్శనం.

## బోలెడన్ని నిధులు.. తినేస్తున్న ఘనులు!

నిరుపేద కష్టజీవుల జీవనోపాధికి ఆటంకం లేకుండా ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ ఆశయం మేరకు ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం గతంలో అనేక పనులు కేటాయించింది. గ్రామాల్లో కాయకష్టంతో బతికేవారికి ఏటా వంద పనిదినాలను కల్పించి, వారికి కనీస వేతనం ఇచ్చే మంచి పథకం ఇది. స్త్రీలకు కూడా ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు. ఈ పథకం కింద ఏటా దేశవ్యాప్తంగా సుమారు 7 కోట్ల కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. వారి కోసం కేంద్రం 75వేల కోట్ల నిధుల్ని కేటాయించింది.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజోపయోగం కోసం కాలువలు తవ్వడం, నీటిపారుదల పనులు చేయడం, ప్రకృతిని పరిరక్షిస్తూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం, డొంకదారులున్న పల్లెప్రాంతాల్లో రోడ్లు వేయడంతో పాటు విద్యా, వైద్య ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు అవసరమైన పనులను ఈ ఉపాధి కూలీలే ఎక్కువగా చేస్తుంటారు.

ఈ పనులు పర్యవేక్షించడానికి కూడా ఒక పెద్ద అధికార వ్యవస్థ ఉంటుంది. జిల్లాస్థాయిలో సంబంధిత ఉన్నతాధికారుల నేతృత్వంలో, గ్రామస్థాయిలో అధికారులు ఈ పనులను చేయిస్తుంటారు. వాళ్ళ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సహాయ పర్యవేక్షకులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఆ వివరాలను ఉన్నతాధికారులకు పంపుతుంటారు. ఇంతటి వ్యవస్థ ఉన్నా, అంతర్గతంగా అవినీతి జరిగిపోయినట్లు అధికారులు గుర్తించారు. కూలీలకు పనులు ఇవ్వకుండానే, పనులు చేయించినట్లు రికార్డులలో చూపించి బిల్లులు డ్రా చేసుకున్నట్లు అధికారుల దర్యాప్తులో గమనించారు. బిల్లులు చేసుకోవడంలో సిద్ధహస్తులైన అవినీతి అధికారులదే మొత్తం పెత్తనమై, అవినీతే సర్వాంతర్యామి అయిందన్నది ఉన్నతాధికారుల పరిశీలనలో తేలినట్లు సమాచారం.

## కోట్లల్లో బయటపడుతున్న అక్రమాలు :

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 47 లక్షల కుటుంబాలు ఈ పథకం కింద ఉపాధి పొందుతున్నాయి. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకంలో జరిగిన అక్రమాలు అన్నిఇన్నీ కావు. గాదెకింద పందికొక్కుల్లా కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది కలసి, 'మాకిది.. మీకిది' అంటూ వంతులు వేసుకుని, వాటాలు పెట్టుకుని మరీ ప్రభుత్వ నిధులను కాజేశారు. మట్టిపనులు చేయించకుండానే చేయించినట్లు రికార్డుల్లో రాయించి ఆ డబ్బునంతా మూటగట్టుకుపోయారు. మొక్కలు నాటడం పేరుతో జరిగిన దుర్వినియోగం అంతా ఇంతా కాదు. రోడ్ల పక్కన పచ్చదనాన్ని పరిరక్షించే పేరుతో ఎంత డబ్బు తినేశారో లెక్కలేదు. మొక్కలు మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్నిచోట్ల ఎండిపోయిన మొక్కల ఆనవాళ్ళు మాత్రం దర్శనమిస్తున్నాయి. దొంగ మస్టర్లువేసి దోచుకోవడంలో ఆరితేరిన సిబ్బంది, అధికారులు దోపిడీముఠాగా ఏర్పడి పేదల సొత్తును సుబ్బరంగా స్వాహా చేసేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ అవినీతి గుట్టంతా, గుట్టలుగుట్టలుగా తవ్వి బయటకి తీస్తున్నారు. జనరల్ అడిట్ అధికారులు రంగంలోకి దిగి ఎక్కడెక్కడ ఎవరెవరు ఎంతెంత తిన్నారో లెక్కలు తేలుస్తున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల అవినితి తిమింగలాలు తిన్న సొమ్మునంతా కక్కిస్తున్నారు. లక్షల్లో రికవరీ చేస్తున్నారు. గత అయిదేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 250కోట్ల రూపాయలకు పైగానే స్వాహా జరిగిపోయినట్లు తేలడంతో ప్రభుత్వమే అవాక్కయ్యింది. దోపిడీదారులపై కఠినచర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. అయితే, కేవలం తిన్నది కక్కించడమే కాక, ఇంతటి అవినీతికి పాల్పడిన అక్రమదారులకి కఠినశిక్షలుంటేే తప్ప భవిష్యత్తులో ఇలాంటి దారుణాలకి అడ్డుకట్ట పడదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కేంద్రం కూడా రంగంలోకి దిగి, దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి. అక్రమార్కుల భరతంపట్టాలి. నిరుపేదలని అడ్డం పెట్టుకుని దోపిడీకి తెరలేపిన ఇలాంటి నీచుల కబంధహస్తాల నుంచి ఈ 'ఉపాధి హామీ' పథకాన్ని కాపాడాలి..!

– రాజశ్రీ

# న్యాయ దేవత అంగట్లో ఆటబొమ్మగా మారిందా?

మన సమాజంలో అత్యంత గౌరవప్రదమైన అత్యున్నత వ్యవస్థ న్యాయ వ్యవస్థ. అలాంటి న్యాయ వ్యవస్థ అపహాస్యమయిపోతుంటే బాధకలుగుతోంది. సమోన్నతమైన వ్యవస్థ అంగట్లో ఆటబొమ్మగా మారిందనే విమర్శలు వినపడుతుంటే ఆందోళన కలుగుతోంది. తాజాగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి అధికార నివాసంలో కోట్ల రూపాయల నోట్ల కట్టలు బయటపడ్డాయన్న వార్తలు న్యాయవ్యవస్థ పవిత్రతపై అనుమానాలు కలిగిస్తున్నాయి. ఏకంగా దేశరాజధానిలోని ప్రధాన న్యాయస్థానానికి చెందిన న్యాయమూర్తిపై ఇలాంటి ఆరోపణలు రావడం, ఆధారాలతో అవి రుజువు అవుతుండడం అత్యంత విచారకరం. ఇలాంటి సంఘటనలు పునరావృత్తమైతే ప్రజలు న్యాయ వ్యవస్థపై పూర్తిగా విశ్వాసం కోల్పోయే ప్రమాదముంది. ప్రభుత్వం నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిజానిజాలు తేల్చాలి...!

– యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# దోమలపై ఆధారపడి లక్షల కోట్ల వ్యాపారం!

రెండు వారాల క్రితం మన 'లాయర్' సత్యపీఠంలో "బాబోయ్ దోమలు... ప్రాణాలు తీస్తున్నాయ్" అంటూ దోమలపై అక్షర దాడి చేశారు. దోమలు చేస్తున్న దండయాత్రకి సంబంధించి ప్రతీ విషయాన్నీ విపులంగా విశదీకరించారు. అయితే, ఒక్క విషయం మాత్రం విడిచిపెట్టారు. దోమల ఆధారిత వ్యాపారాన్ని గురించి కూడా ఆ వ్యాసంలో పొందుపరచి ఉంటే పరిపూర్ణంగా ఉండేది. దోమలకోసం ఆవిర్భవించిన దోమతెరలు, కాయిల్సు, బ్యాట్లు, బిళ్ళలు, కడ్డీలు, ఓడోమస్ లాంటి క్రీములు, ఆల్ అవుట్ లాంటి లిక్విడ్లు, ఫాగింగ్ యంత్రాలు, వాటిలో వాడే రసాయనాలు... ఇలా దోమల బారినుండి తప్పించుకోవడానికి అనేక రకాల వస్తువులని ప్రపంచవ్యాప్తంగా కొన్ని వేల కోట్ల మంది వాడుతున్నారు. అంటే.. దోమల పుణ్యమా అంటూ ప్రపంచమంతా కొన్ని లక్షల కోట్ల రూపాయల వ్యాపారం నిత్యం జరుగుతోందన్నమాట. నిత్యం మన కళ్ళముందు కదలాడే అతి చిన్న దోమ అతి పెద్ద వ్యాపార సామ్రాజ్యానికి మూలం అంటే నమ్మగలమా...? నమ్మాల్సిందే మరి.. అదే నిజం..!

– టీ. రమణయ్య, నెల్లూరు.




# వీ.ఆర్. విద్యా సంస్థల పునః ప్రారంభ నిర్ణయం.. అభినందనీయం!

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అపరిపక్వత నిర్ణయాలలో భాగంగా మూతబడిపోయిన వీ.ఆర్. హైస్కూలు, వీ.ఆర్.కాలేజీలని పునఃప్రారంభించాలన్న టీడీపీ ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం. నెల్లూరు జిల్లాలోనే ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలని అర్థాంతరంగా మూసేయడం అర్ధరహితం. వీ.ఆర్. విద్యాసంస్థలకు పూర్వవైభవం తెస్తామని మునిసిపల్ మంత్రి నారాయణ గారు ప్రకటించడం సంతోషదాయకం. ప్రపంచ వ్యాప్తంగా తమ ప్రతిభని కనబరుస్తున్న ఎంతోమంది మేధావులని తీర్చిదిద్దిన చరిత్రాత్మక సంస్థలు వీ.ఆర్. విద్యాసంస్థలు. వాటిని మళ్ళీ తెరిపించి పూర్వవైభవాన్ని తెచ్చే ప్రయత్నాన్ని చేస్తున్న పొంగూరు నారాయణ గారికి అభినందనలు.

ఆర్. గోవర్ధన్‌రావు, బెంగళూరు.

• శ్రీసిటీ-కొబెల్కో పరిశ్రమ ఘనత

# 20 వేలవ ఎక్స్కవేటర్ విడుదల



దేశంలోని నిర్మాణ పరికరాల తయారీలో దిగ్గజ కంపెనీ కోబెల్కో కన్స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ ఇండియా (కేపీఇఐ) పరిశ్రమ, అత్యాధునిక శ్రీసిటీ ప్లాంట్లో 20వేలవ ఎస్కె-220 ఎక్స్కవేటర్ ఉత్పత్తితో ఒక ప్రధాన మైలురాయిని అధిగమించింది. ఆ కంపెనీ ఆవరణలో ఈనెల 22న జరిగిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ, ఇది అద్భుతమైన విజయమంటూ కేపీఇఐని అభినందించారు. కేసీఇఐ వృద్ధి శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ మరియు ఆంధ్రప్రదేశ్ పెట్టుబడి అనుకూల విధానాలు, వ్యాపార సౌలభ్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కేసీఇఐ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్ సమక్షంలో ఆ కంపెనీ ఎం.డీ మరియు సీఈఓ టకేమిచి హిరకావా పాల్గొని 20,000వ ఎక్స్కవేటర్ను విడుదల చేశారు. దానిని తమ ప్రధాన కస్టమర్ కెఎన్ఆర్ కన్స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.జలంధర్రెడ్డికి అప్పగించారు. భారతదేశ మౌళిక సదుపాయాల వృద్ధికి తమ భాగస్వామ్యాన్ని కొనసాగిస్తామన్నారు. కేసీఇఐ ప్రారంభమైనప్పటి నుండి తన అమూల్యమైన సహకారం, మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నారంటూ శ్రీసిటీ ఎం.డీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మైలురాయి వారి తయారీ నైపుణ్యానికి, శ్రీసిటీలో అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆధునిక ఇంజినీరింగ్కు కేంద్రంగా శ్రీసిటీ స్థానం పటిష్టంగా ఉందన్నారు. కేసీఇఐ ఫ్యాక్టరీ హెడ్.. వైస్ ప్రెసిడెంట్ తోషియుకి తట్సుగామి ప్లాంట్ ఉత్పత్తుల శ్రేణిని వివరిస్తూ, మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా మరిన్ని నూతన శ్రేణిలను పరిచయం చేయడానికి కేసీఇఐ కట్టుబడి ఉందన్నారు.

# ప్రతి తరగతికి.. ఒక ప్రత్యేక గది

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ సూచనలతో ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో కలిగిస్తున్న వసతుల్లో భాగంగా, ప్రతి తరగతికి ప్రత్యేక గది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరులో మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ పాఠశాలలను మోడల్ స్కూల్స్గా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల పార్కుల్లో అధునాతన క్రీడాపరికరాలతో కొత్త బాటలు వేస్తామన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు నగర నియోజకవర్గంలోని అన్ని మున్సిపల్ పాఠశాలలను, అన్ని పార్కులను సందర్శించామని, వాటిలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. నెల్లూరులోని అన్ని మున్సిపల్ పాఠశాలలను కూడా ఆధునీకరించి రాష్ట్రంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. వచ్చే జూన్లో పాఠశాలలు పున:ప్రారంభించే సమయాని కల్లా ఆ అభివృద్ధి పనులన్నింటిని పూర్తిచేయిస్తామన్నారు. నెల్లూరును దోమలు లేని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు.

## కాకర్ల చేతుల మీదుగా..

# కోటి రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు



ఉదయగిరి నియోజకవర్గంలో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ, కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం చేయించుకున్న 78 మంది బాధితులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈనెల 23న సుమారు కోటి రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో 8 మండలాల టీడీపీ మండల కన్వీనర్లు, తెలుగుదేశం, జనసేన బిజెపి నాయకులు, గ్రామ నాయకుల సమక్షంలో కాకర్ల సురేష్, ఆయన సతీమణి కాకర్ల ప్రవీణ ఆధ్వర్యంలో బాధితులకు చెక్కులను అందజేశారు. ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా అందని వైద్యానికి సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందజేయడం జరిగిందని కాకర్ల చెప్పారు. బాధితులకు సాయం అందించినందుకు ఉదయగిరి నియోజకవర్గం ప్రజల తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, యువ నాయకుడు నారా లోకేష్కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ చంచలబాబుయాదవ్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కొట్టే వెంకటేశ్వర్లు, బిజెపి నాయకుడు కదిరి రంగారావు, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతకు నిలువుటద్దం.. వివిఎస్ రాంబాబు

## 'మహోన్నత సేవా పతకం' అందుకోనున్న నిఖార్సయిన అధికారి!



పోలీసుశాఖలో పనిచేయడమే కాదు, ఆ శాఖలో అవార్డులు, రివార్డులు సాధించడమంటే మాటలతో పనికాదు. అందుకు ఎంతో కష్టపడాలి. రేయింబవళ్ళు శ్రమిస్తూ, అనునిత్యం అకుంఠిత దీక్షతో అనుకున్న లక్ష్యాలను అధిగమించగలగాలి. కృషి-పట్టుదల, వృత్తి పట్ల అపారమైన గౌరవం.. అంకితభావం ఉంటే తప్ప అవార్డులు, పతకాలూ రావు. అయితే, క్రమశిక్షణకు.. కర్తవ్య నిర్వహణకు మారుపేరుగా నిలుస్తూ.. పోలీసుశాఖకే వన్నె తెస్తున్న పోలీసు అధికారి వివిఎస్ రాంబాబు తన కెరీర్ మొత్తంలో వరుసగా పలు విశిష్టమైన పతకాలు సాధించడం అభినందనీయం. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకి 'మహోన్నత సేవా పతకం' కూడా ప్రకటించిందంటే ఆయన ప్రతిభా పాటవాలకు అదో నిదర్శనం.

ఉగాది పర్వదినం.. తెలుగు నూతన సంవత్సరారంభాన్ని పురస్కరించుకుని.. ఉత్తమ సేవలతో పోలీసుశాఖ గౌరవప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్న పోలీసు అధికారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవార్డులను ప్రకటిస్తుండడం తెలిసిందే. ఈసారి ఆ అవార్డుల్లో 'మహోన్నత సేవా పతకం'కి రాంబాబు ఎంపిక కావడం గర్వకారణం. ప్రస్తుతం ఏలూరులో అడిషనల్ ఎస్పీగా వుంటూ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ హోదాలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు.

నెల్లూరోళ్ళకు ఆయన బాగా సుపరిచితులే. గతంలో నెల్లూరు జిల్లాలో ఆయన ఎస్ఐ నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి దాకా పనిచేసి, నేరాల నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేశారు. అప్పట్లో ఎన్నో కీలకమైన కేసులను కూడా ఆయన ఆధ్వర్యంలో ఛేదించారు. పోలీసుశాఖలో పలు హోదాల్లో దీక్షాదక్షతలతో పనిచేసి ఉన్నతాధికారుల అభినందనలు అందుకున్నారు రాంబాబు.

### విశేష సేవలకు.. విశిష్ట పతకాలు

రాష్ట్రంలో వృత్తిరీత్యా విశేష సేవలందిస్తున్న పోలీసు అధికారులకు ప్రభుత్వం తొలుత సేవా పతకం, ఆ తర్వాత ఉత్తమసేవా పతకం, దాని తర్వాత ఎంతో ప్రతిష్టాత్మకమైన 'మహోన్నత సేవా పతకం' బహుకరిస్తుంటుంది. ఈ నేపథ్యంలో, 2003లోనే రాంబాబు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'సేవా పతకాన్ని' పొందారు. ఆ తర్వాత 2011లో 'ఉత్తమ సేవా పతకాన్ని' సాధించారు. ఇప్పుడు (2025)లో వాటికంటే గొప్పదైన 'మహోన్నత సేవా పతకానికి' కూడా ఎంపికయ్యారు. ఒక పోలీసు అధికారిగా ఆ మూడు విశిష్ట పతకాలను సాధించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. అంతేకాదు, 2018లో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ఆయన ప్రతిష్టాత్మకమైన 'ఉత్కృష్ట సేవా పతకాన్ని' అందుకున్నారు. 2022లో 'పోలీస్ మెడల్'ను కూడా కైవసం చేసుకున్నారు. ఇప్పటిదాకా దాదాపు 200కి పైగానే ఆయన అవార్డులు, రివార్డులు సాధించారంటే, నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు ఆయనెంతగా శ్రమించివుంటారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ అవార్డులన్నీ ఆయన నిరుపమానమైన సేవలకు, వృత్తిపట్ల అంకిత భావానికి నిదర్శనమంటూ పోలీసుశాఖలోని అధికారులు, సహచరులు, అభిమానులు కొనియాడుతున్నారు. ఏదేమైనా సమాజానికి ఉత్తమ సేవలందిస్తూ, అందుకు గుర్తింపుగా విశిష్ట అవార్డులందుకుంటూ, పోలీసుశాఖ గౌరవాన్ని ఇనుమడింప చేస్తూ.. అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిన రాంబాబుకు..'లాయర్' శుభాకాంక్షలు!

# పర్యాటక ప్రాంతాలుగా మైపాడు, రామతీర్థం!

'తరంగ్ రిసార్ట్స్' ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నిత్యం ఎంతోమంది పర్యాటకులు వస్తున్న కోవూరు నియోజకవర్గంలోని రామతీర్థం, మైపాడు బీచ్లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. రామతీర్థంలో ఇటీవల 'తరంగ్ రిసార్ట్స్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, గతంలో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నిర్మించిన ఈ రిసార్ట్స్ను పునఃప్రారంభించడం హర్షదాయకమన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు సమీపంలోని సాగర తీరంలో సముద్రస్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటుంటారని, ఈ రిసార్ట్స్ ఏర్పాటుతో రామతీర్థం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని ఆమె ఆకాంక్షించారు.

## ధృవకుమార్

# గానం..అద్భుతం!



పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్లుగా.. చిన్న వయసులోనే తన గాన మాధుర్యంతో అందరినీ ఓలలాడిస్తున్నాడు నెల్లూరుకు చెందిన ధృవకుమార్రాజు. యూకేజీ చదువుతున్న ధృవకుమార్ గత మూడు సంవత్సరాల నుంచి ఎన్నో సంగీత కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రజల ప్రశంసలందుకోవడం విశేషం. దేశభక్తి గీతాలు, భగవద్గీత, అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు అద్భుతంగా గానం చేయడం ధృవకుమార్ ప్రత్యేకత. ఇటీవల నెల్లూరు టౌన్హాల్లో నిర్వహించిన 60వ త్యాగరాజ ఉత్సవాల్లో పలు సంకీర్తనలను హృద్యంగా గానం చేసి శ్రోతలను పరవశింపజేశాడు. గతంలో.. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వారు, నారాయణ కళాశాల వారు నిర్వహించిన కార్యక్రమాల్లోనూ పాల్గొని బహుమతులు అందుకున్నాడు. జిల్లా ఉన్నతాధికారులు సైతం ధృవ కుమార్ను అభినందిస్తున్నారు.

# ధాన్యం సేకరణలో వివక్ష చూపొద్దు



ధాన్యం సేకరణ సందర్భంగా అధికారులు రైతుల పట్ల వివక్షతో వ్యవహరించవద్దని, రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. విడవలూరు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఆమె ఇటీవల ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా, ధాన్యం అమ్ముకోవడంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస గిట్టుబాటు ధరగా 19,720 రూపాయలు అందుతున్నాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. పెద్ద రైతుల నుంచి ధాన్యం సేకరణకు మొగ్గుచూపుతున్న అధికారులు, చిన్న, సన్నకారు రైతులను పట్టించుకోవడం లేదన్న రైతుల ఆవేదనపై ఆమె స్పందించారు. ధాన్యం సేకరణలో రైతుల పట్ల వివక్ష చూపరాదన్నారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీల కొరత గురించి రైతులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తేవడంతో, ఆమె వెంటనే జాయింట్ కలెక్టర్తో ఫోన్లో మాట్లాడారు. ఇప్పటికే 32 మంది మిల్లర్లతో ధాన్యం సేకరణకు సంబంధించి ఒప్పందం కుదిరివుందని, అవసరమైతే ప్రకాశం, బాపట్ల పరిధిలోని మిల్లర్లు కూడా ధాన్యం సేకరించేలా అధికారులు సమాయత్తం చేస్తున్నారన్నారు. పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథస్వామికి 23.36 లక్షల రాబడి



నెల్లూరు రంగనాయకులపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయానికి భక్తులు ఇటీవల సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం వచ్చింది. ఈనెల 24న ఆలయ హుండీలను లెక్కించగా, గత అక్టోబరు 5 నుంచి మార్చి 24 వరకు 23,36,712 రూపాయలు వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, మార్చి 9 నుంచి 20వ తేదీ వరకు రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక హుండీలు ఏర్పాటుచేయగా, వాటిద్వారా 2,32,094 రూపాయలు రాబడి రావడం విశేషం.

## ఐసీడీఎస్ పీ.డీగా..నిర్మలాదేవి



జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నిర్మలాదేవి ఈనెల 25న నెల్లూరులోని తమ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పీ.డీగా ఉన్న సుశీలాదేవి అనారోగ్యంతో సెలవు పెట్టడంతో, జిల్లా కలెక్టర్ ఆ స్థానంలో బీసీ కార్పొరేషన్ ఇ.డిగా పనిచేస్తున్న నిర్మలాదేవిని పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు.

## ఆర్‌పిఎఫ్ ఆఫీసులో.. ఐజీ తనిఖీ

నెల్లూరులోని ఆర్‌పిఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) కార్యాలయాన్ని ఆర్‌పిఎఫ్ ఐజీ ఆరోమాసింగ్ ఈనెల 25న సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నెల్లూరు రైల్వేస్టేషన్‌కి వచ్చి సిబ్బంది పనితీరును ఆరాతీశారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో సక్రమంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయ పన్ను.. సకాలంలో చెల్లించాలి

ఆదాయ పన్నును సకాలంలో చెల్లించాలని ఆ శాఖ అదనపు కమిషనర్ శ్రీధర్ చెప్పారు. పన్ను చెల్లింపుపై స్థానిక ఐఎంఏ హాలులో వైద్యులకు ఈ నెల 25న నిర్వహించిన సదస్సులో వివరించారు. అడ్వాన్స్‌ట్యాక్స్, పన్ను చెల్లింపు విధానాన్ని ఆయన తెలియజేశారు. అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు, ఆదాయపన్ను అధికారి సందీప్‌కృష్ణ, డాక్టర్ అశోక్, ఐఎంఏ ప్రెసిడెంట్ అమర్‌నాథ్, సెక్రటరీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పోషకాహారం పంపిణీ

నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో 50 మంది రోగులకు స్థానిక అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈనెల 24న పోషకాహారం పంపిణీ చేశారు. ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతినెలా తాము రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, రేడియేషన్ అంకాలజిస్ట్ డా. గీతా ఉషశ్రీ, జీఎం భక్తవత్సలరెడ్డి, ఏపీయుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### వేణుగోపాలస్వామి దేవాలయానికి..

## పూర్వవైభవం తెస్తాం

### దేవాదాయశాఖ మంత్రి ఆనం



నెల్లూరులోని ప్రసిద్ధమైన రుక్మిణి-సత్యభామాదేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని మరింతగా అభివృద్ధి చేసి, పూర్వవైభవం తెస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 24న ఆయన ఆలయ పాలకమండలి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొలుత ఆయన శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

## పశుసంవర్ధక శాఖ.. కొత్త కార్యవర్గం



జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారుల సేవా సంఘం వారు ఈనెల 25న కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా కోవూరు అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఐ కృష్ణమౌర్య, ప్రధాన కార్యదర్శిగా డా. డి.మాధవీలత ఎన్నికయ్యారు. అదేవిధంగా, ఉపాధ్యక్షులుగా మాలకొండయ్య, శశిధర్, సంయుక్త కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా డా.జే.చైతన్యకిశోర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు డా.బి.మురళీకృష్ణ, డా. జే యశోద, డా. బి.సురేష్, డా. కె.సురేష్, డా.వైవీ కామేశ్వరరావు, డా.సిహెచ్ లక్ష్మీశైలజ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. నెల్లూరు, పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో రాష్ట్ర సంఘం నాయకుడు టీ.మోహన్‌రావు పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. ఎన్నికైన అధికారులందరినీ జేడీ డా.రమేష్‌నాయక్ అభినందించారు.

## సర్వత్రా సంతోషం నిండాలి

సమాజంలో సర్వత్రా సంతోషం నిండాలని, అందరికీ ఆనందం కలిగేలా ప్రభుత్వాల విధానాలు రూపుదిద్దుకోవాలని నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు ఆకాంక్షించారు. ఈనెల 26న నెల్లూరు బాలాజీనగర్‌లోని నలంద ఇంగ్లీష్ మీడియం స్కూలులో జరిగిన 'అంతర్జాతీయ సంతోష దినోత్సవం'లో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉప కార్మిక కమిషనర్ డాక్టర్ రాచపాలెం రఘు మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 2012 జూన్ 28న చేసిన తీర్మానంలో మార్చి 20వ తేదీని అంతర్జాతీయ సంతోష దినోత్సవంగా నిర్ణయించారని గుర్తుచేశారు. అనంతరం, వక్తృత్వ పోటీలో విజేతలకు బహుమతులిచ్చారు. స్కూలు ప్రిన్సిపాల్ కె.ఎస్.వి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తేజస్వికి అరుదైన గుర్తింపు





విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎల్.తేజస్వికి ఇటీవల అరుదైన గుర్తింపు లభించింది. 2025 జనవరి 26న నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్నుంచి ప్రాతినిధ్యం వహించినందుకు గాను, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఆమె ప్రశంసాపత్రాన్ని అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు తేజస్విని అభినందించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ తేజస్వి అందుకున్న గౌరవం, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయశంకర్ అల్లం, ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ కె విద్య ప్రభాకర్, డాక్టర్ ఎస్.బి. సాయినాథ్, డాక్టర్ బి వి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని తేజస్వికి శుభాకాంక్షలు చెప్పారు.

## సినారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. కవితోత్సవం





అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ప్రముఖ కవి చిన్ని నారాయణరావు (సినారా) ఫౌండేషన్ వారు వైభవంగా కవితోత్సవం నిర్వహించారు. నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత శ్రీరామకవచం సాగర్ రచించిన 'నిర్వేదం' నవలను ఆవిష్కరించారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ నవలను ఆవిష్కరించి మాట్లాడుతూ, నేటి సమాజంలో నానాటికీ పుస్తకాలు చదవడం తగ్గిపోతోందన్నారు. ఎంతో కష్టపడి పుస్తకాలు రచించే సాహితీవేత్తలను అందరూ ప్రోత్సహించాలన్నారు.

పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. చిన్ని నారాయణరావు సభను ప్రారంభిస్తూ, శ్రీరామకవచం సాగర్ రచనలు సమాజాన్ని ఎంతో చైతన్యవంతం చేస్తాయన్నారు. నుడా ఛైర్మెన్ వచ్చి నవలను ఆవిష్కరించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో చదివిన కవితలను సంకలనంగా ప్రచురిస్తామని తెలిపారు. చిన్ని నారాయణరావు ఫౌండేషన్ తరపున చేస్తున్న అనేక సాహితీ కార్యక్రమాలను ఆయన వివరించారు. కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి సభను నిర్వహించారు. అవ్వారు శ్రీధర్‌బాబు, పాతూరు అన్నపూర్ణ కవితా దినోత్సవంపై మాట్లాడారు. ఆ నవలను ప్రముఖ విమర్శకులు బారమహ్మతుల్లా సమీక్షించారు. అనంతరం, నవలా రచయిత శ్రీరామకవచం సాగర్‌ను ఫౌండేషన్ తరపున ఘనంగా సన్మానించారు. కవి సమ్మేళనంలో సుమారు 40 మందికి పైగా కవులు పాల్గొని కవితాగానం చేశారు.

## కాళిదాసు పురుషోత్తంకి.. 'అరసం' పురస్కారం



ప్రముఖ సాహితీవేత్త, చరిత్రకారుడు, స్థానిక సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా. కాళిదాసు పురుషోత్తంకి అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ వారు ఈనెల 25న 'విశ్వావసు-2025 ఉగాది పురస్కారాన్ని' అందజేశారు. అరసం ప్రతినిధులు స్వయంగా కాళిదాసు పురుషోత్తం నివాసానికి వెళ్ళి ఆ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. 'అరసం' జిల్లా అధ్యక్షుడు డా. గంగిశెట్టి శివకుమార్, ఉపాధ్యక్షుడు టేకుమళ్ల వెంకటప్పయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ, కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబుతో పాటు ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభ కలిగిన విద్యార్థులకు..

## నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరులోని టీవీఎస్ కల్యాణసదన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 24న జిల్లాలో ప్రతిభ కలిగిన 79 మంది బ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులందజేశారు. స్థానిక శ్రీకృష్ణయోగ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్, బీడీఎస్, ఎంబీబీఎస్‌లలో ఉత్తమ ఉత్తీర్ణతలు సాధిస్తూ ప్రతిభతో చదువుకుంటున్న వారికి ప్రోత్సాహకరంగా మొత్తం 6.18 లక్షల రూపాయలను బహుకరించారు. కల్యాణ సదన్ ట్రస్టీ ఫణిరత్నం, అధ్యక్షులు డాక్టర్ సర్వేపల్లి పరాశర్, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి..

# ఒక్క రూపాయి చెల్లిస్తే చాలు

**-- మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ --**



నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మరికొద్ది రోజుల్లోనే పూర్తి కానుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 165 కోట్ల హడ్కోనిధులతో, నగరంలో మిగిలిపోయిన 10 శాతం పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని మంత్రి నారాయణ చెప్పారు. ఈనెల 24న ఆయన నెల్లూరు నగరంలోని రామ్మూర్తి నగర్, సుబేదార్‌పేట, సంతపేట, రంగనాయకులపేట, ఇసుక డొంక, ఆనకట్ట రోడ్డుల్లోని మున్సిపల్ పాఠశాల, ఉర్దూ పాఠశాలలను సందర్శించి తిక్కన పార్కులో విలేకర్లతో మాట్లాడారు. దాదాపు 1200 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తి చేస్తున్న భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ ను కేవలం ఒక్క రూపాయికే ప్రజలకు అందిస్తామని చెప్పారు. పాఠశాలల్లోని ఆటస్థలాలను పరిశీలించి, అనువైన చోట షటిల్, బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేయాలంటూ ఆయన అధికారులను ఆదేశించారు.

గతంలో 5వేల రూపాయలు ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం కనెక్షన్ ఫీజును.. ముఖ్యమంత్రితో మాట్లాడి కేవలం ఒక్క రూపాయితోనే ఇచ్చేలా ఒప్పించడం జరిగిందని, ఇది నెల్లూరు ప్రజలకు శుభవార్తని ఆయన చెప్పారు. నెల్లూరు నగరాన్ని దేశంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని ఆయన తెలిపారు. అదేవిధంగా, రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లోని పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామన్నారు.

# ఆయన రూటే.. సెపరేటు!

## రూరల్ రూలర్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి




**ఆయన రూటే సెపరేటు. జనంతో కలివిడిగా తిరగడంలో కానీ, జనం మనిషిగా నిలబడడంలో కానీ.. ఆయన ప్రత్యేకత ఆయనదే. నెల్లూరు రూరల్ రూలర్‌గా.. ఆ నియోజకవర్గానికి ఎంతో ప్రఖ్యాతి తెచ్చిన శాసన సభ్యునిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అటు రాజకీయాల్లోనూ, ఇటు ప్రజాజీవితంలోనూ తన ప్రత్యేక శైలితో సాగిపోతున్నారు.**

ఇటీవలే నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పథకాల జాతరను అత్యద్భుతంగా నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి... ఆ పనులకు కేవలం శంకుస్థాపనలే కాదు.. త్వరలోనే పూర్తిచేయించి ప్రారంభోత్సవాలు చేయించేందుకు సమాయత్తమవుతున్నారు. శ్రీధర్‌రెడ్డి మాట చెప్తే.. అది జరిగిపోయినట్లేనని ఆయన ధీమాగా చెప్పారు. మాటల్లో కాదు.. చేతల్లో కూడా తానేమిటో రుజువు చేసుకుంటూ ఆయన ముందుకు సాగిపోతున్నారు. తనను మూడుసార్లు గెలిపించిన రూరల్ ప్రజల అభివృద్ధికి ఎంతటి పనైనా సరే, ఎన్ని కోట్ల రూపాయల వ్యయమయ్యే పనులైనా సరే..సాధించి తీరుతామంటున్నారాయన. ఈ నేపథ్యంలో మొన్నటికి మొన్న ఆయనొక సామాన్యునిలాగానే



స్కూటీ ఎక్కి, హెల్మెట్ పెట్టుకుని నియోజకవర్గంలో ఒంటరిగా పర్యటించడం ప్రజలను బాగా ఆకట్టుకుంది. రూరల్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో జరుగుతున్న 303 అభివృద్ధి పనులు ఎంతవరకు వచ్చాయో... ఆయన స్వయంగా తన ఆకస్మిక పర్యటనలో తెలుసుకున్నారు. సాధారణంగా ఎమ్మెల్యే పర్యటన అంటే..పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు..పెద్ద హడావిడీ ఉంటుంది. అలాంటి పటాటోపాలేమీ లేకుండా, ఆకస్మికంగా 21వ డివిజన్‌లో ఆయన పర్యటించడం విశేషం. అంతేకాదు, అభివృద్ధి పనుల స్థితిగతులను నేరుగా ప్రజల ఇళ్ళవద్దకే వెళ్ళి వారినే అడిగి తెలుసుకున్నారు. ఇంకేమైనా సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, పనులు జరుగుతున్న సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు వస్తే నేరుగా తనకే ఫోన్ చేయండని ఆయన స్థానిక ప్రజలకు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో మే 20వ తేది నాటికి పనులు పూర్తికావాలని సంబంధిత అధికారులను కూడా ఆయన ఆదేశించి.. దటీజ్ శ్రీధర్‌రెడ్డి అనిపించుకున్నారు.


## ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం, మా కంటి దీపం,
మా తల్లి గారైన

**శ్రీమతి యర్రం పిచ్చమ్మ గారు**

(W/o స్వర్గీయ యర్రం చిన్న పోలిరెడ్డి)

తేది. 17.03.2025 సోమవారం స్వర్గస్తురాలైనారు.

**వారి పవిత్ర ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...**

కుమారులు - కోడళ్ళు

**వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ, రాజ్యసభ - స్వర్ణలతారెడ్డి**

**వై.వి.భద్రారెడ్డి - రాధికారెడ్డి**

**వై.హనుమారెడ్డి - హిమబిందురెడ్డి**

కుమార్తె - అల్లుడు

**బి.శచీదేవి - బి.శ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి**

మనుమళ్ళు, మనుమరాలు

**వై.విక్రాంత్‌రెడ్డి, వై.తన్మయి, వై.తన్విత్‌రెడ్డి, బి.ప్రణీత్‌రెడ్డి**

**ఉత్తరక్రియలు**

వారి ఉత్తరక్రియలు తేది. 31.03.2025, సోమవారం ఉ॥ 11 గం.లకు ఒంగోలు సౌత్ బైపాస్‌రోడ్‌లోని సాయి ఐటిఏ ఫంక్షన్ హాల్ నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.





జానకిరామ.. రామాయణం 58

- ఊటుకూరు జానకి రామారావు



రావణుడు కొలువుకూటంలో ఉన్నతమైన రత్నఖచిత సింహాసనం మీద ప్రజ్వరిల్లుతున్న అగ్నిలాగా మహాతేజస్సుతో కూర్చొని ఉన్నాడు.

ఆ రాక్షస రాజు శరీర కాంతి నున్నని వైఢూర్యమాణిక్యపు కాంతివలె ఉంది. కాల్చి శుద్ధిచేసిన బంగారు కుండలాలు ధరించి ఉన్నాడు. అందంగా ఉన్న భుజాలు, తెల్లని దంతకాంతి, పెద్ద ముఖంతో పర్వతంలాగా ఉన్నాడు.

ఆయన గొప్ప తపస్సంపన్నుడు. బ్రహ్మ గురించి పదివేల సంవత్సరాలు ఘోర తపమాచరించి తన శిరస్సులు అర్పించినవాడు.

అతని శరీరం మీద ఎక్కడ చూసినా ఆయుధాల దెబ్బలు మానిన గుర్తులే!

మరీ విశేషంగా ఇంద్రుడి వజ్రాయుధపు దెబ్బలే అవి!

అవి ఒక యోధుడికి అలంకారాలు.

వాడు మృత్యువుకే మృత్యువు!

వాడు మహాక్రూరుడు, పూర్తికావచ్చిన యజ్ఞాలను ధ్వంసం చేసి వికృతానందం పొందేవాడు.

వాడి కంటికి అందంగా కనపడ్డ ప్రతి స్త్రీ వాడి సొంతం కావలసినదే. అలాంటి స్త్రీని దక్కించుకోవడానికి వాడు ఎంతటి సాహసమైనా చేస్తాడు.

వాడు ఒకసారి మహావిషసర్పం తక్షకుడి భార్యను చూశాడు, అంతే వాడి మనసు నిలవలేదు. భోగవతిని ముట్టడించాడు, రాజైన వాసుకిని ఓడించాడు. తక్షకుడి ప్రియభార్యను బలాత్కారంగా తెచ్చుకున్నాడు.

కుబేరుడి మీదకు దండయాత్రకు పోయి అతడి పుష్పక విమానాన్ని తెచ్చుకున్నాడు.

వాడికి కోపం వస్తే అలా వెళ్ళిపోయి దేవతల చైత్రరథాన్ని, నందనవనాన్ని, పద్మసరస్సును ఊరకే పాడు చేసేవాడు.

యజ్ఞధ్వంసంపై ఆసక్తి, బ్రహ్మహత్యలు వాడికి అలవాటు. కఠినుడు, దుష్ప్రవర్తనగలవాడు, జాలిలేదు, ప్రజలకు అహితం చేయటంలో వాడికి ఆసక్తి మెండు.

కొలువుదీరి ఉన్న మహాభయంకరుడైన రాక్షసరాజు వద్దకు వచ్చి వాలింది శూర్పణఖ.

అది భయం, కోపం, అవమానం కలగలసిన తత్తరపాటుతో ఉంది. అది ఇంతవరకు జీవితంలో రాముడిలాంటి యోధుడిని చూడలేదు, వినలేదు. అంతటి దెబ్బ ఎప్పుడూ తినలేదు.

మంత్రులతో కూర్చొని సమాలోచనలు చేస్తున్నాడు రావణుడు.

సుడిగాలిలా వచ్చి అతడి ముందు వాలింది శూర్పణఖ.

వచ్చీరావడంతోనే రావణుని నిందించడం మొదలుపెట్టింది.

నీవేమి రాజువు! నీకు పోగాలం దాపురించిందిలే! అసలు బయట ప్రపంచంలో ఏమి జరుగుతుందో నీకు పడుతుందా! అవునులే నీ గూఢచార వ్యవస్థ అంత దరిద్రంగా తగలబడ్డది, నీపాటికి నువ్వు హాయిగా నచ్చిన దానితో కులుకుతూ, భోగాలలో మునుగుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నావు.

నీకు భోగాలు ముఖ్యమని అనుకుంటూ కాలం గడుపుతున్నావు. నీలాంటి రాజును జనులు స్మశానపు అగ్నిలాగ గౌరవించరు. భోగాలలో మునిగిన రాజు సముద్రంలో మునిగి ఉన్న పర్వతంలాగా శోభిల్లడు.

ఇంత చపల చిత్తుడవు, నీవు రాజు ఎలా కాగలిగావు?

నీకు పరాక్రమం ఒకటుంటే సరిపోదు! గూఢచార వ్యవస్థ, కోశాగారం, పరిపాలనా వ్యవహారం నీ ఆధీనంలో ఉంచుకోవటం తెలవాలి, అప్పుడే నీ రాజ్యం స్థిరపడుతుంది.

అసలు నీవేమి తెలుసుకుంటున్నావో నాకు తెలియటం లేదు.

అక్కడ జనస్థానంలో కొంపలంటుకుంటున్నాయి.

నీ సైన్యం పదునాల్గు వేల మందినీ ఒకడు ఊచకోత కోశాడు, దూషణుడు, త్రిశిరుడు, మహాబలశాలి ఖరుడు అందరూ ఆ ఒక్కడి చేతులలో ఒకేసారి చనిపోయారు.

వాడు రాముడు!

ఆ రాముడు ఋషులకు అభయమిచ్చినాడు!

వారికి రాక్షస బాధ లేకుండా చేస్తానని!

ఎండిన కర్రలు, మట్టిబెడ్డ, బూడిద వీటివల్ల ఉన్న ఉపయోగం కూడా స్థానభ్రష్టుడు అయిన నీ వంటి రాజు వల్ల ఉండదు.

శూర్పణఖ మాట్లాడే మాటలు రావణుడి హృదయంలో క్రోధాగ్నిజ్వాలలు రేపుతున్నాయి, మంత్రుల సమక్షంలో ఆ విధంగా చిన్నబుచ్చుతూ మాట్లాడింది!

ఎరుపెక్కిన కన్నులతో ఇలా అన్నాడు, ఎవడా రాముడు? ఎట్లాంటిది వాడి బలం? అసలు అంత దుర్గమమైన దండకారణ్యంలో వాడెందుకు ప్రవేశించాడు? అతని ఆయుధం ఏమిటి? అని ప్రశ్నించాడు.

అప్పుడు శూర్పణఖ, అతడు దశరథ కుమారుడు, ఆజానుబాహువు, విశాలమైన నేత్రాలున్నవాడు, నారచీరను, కృష్ణాజినాన్ని ధరించి ఉన్నాడు. మన్మథుడితో సమానమైన సౌందర్యం ఆతనిది!

**కందర్ప సమరూపశ్చ రామో దశరథాత్మజః**

అని పలికి రాముడి పరాక్రమాన్ని వర్ణించ సాగింది.

కోదండమో అది అసురుల పాలిటి యమదండమో, ధనుర్ధారి రాముడిని చూడగానే దండధారి యముడు గుర్తుకు వస్తాడు.

ఆయన చేతిలోని ఆటబొమ్మ ఆ ధనుస్సు!

ఎప్పుడు బాణం తీస్తున్నాడో, ఎప్పుడు సంధిస్తున్నాడో, ఎప్పుడో వదులుతున్నాడో, చూసేవారి కన్నులకు అస్సలు అగుపడదు! మనసైన్యంలోని వారు టపటప నేలకూలడమే నాకు కనుపించింది.

వడగళ్ళవానకు పంటచేలు నాశనమైనట్లుగా మనవారు చనిపోవడమే నేను చూశాను.

ఒంటరివాడు! పైగా పాదచారి వీడేమిచేయగలడు? అని అనుకుంటే కేవలం ఒకటిన్నర ముహూర్త కాలంలో అందరినీ మట్టుబెట్టాడు.

ఆడుదానిని చంపటం ఎందుకని నన్ను ఒక్కదానిని మాత్రం వదిలివేశాడు.

రాముడికి ఒక తమ్ముడున్నాడు.

వాడు వీడి అంతటి వాడు.

అన్న అంటే వానికి సర్వస్వం.

వాడు రాముడికి బయట తిరుగాడే ప్రాణం, వాని పేరు లక్ష్మణుడు.

రాముడి వెంట అతని భార్య కూడా ఉంది.

ఆవిడ పేరు సీత! ఆవిడ సౌందర్యాన్ని ఏమని వర్ణించను!.

ఆమె శరీరం తళుకులీనే బంగారు కొండ!

ఆమె శరీరపు సుగంధం సంపెంగ దండ వాసన వస్తుంది!

ఆవిడ ఇందువదన, కుందరదన.

ఆ అందం ముల్లోకాలలో వెతికినా కానరాదు.

ఆ చక్కదనాల చుక్క నీ ప్రక్కన లేకపోవడమే నీకు తక్కువ!

ఆమె వలపులు నీకు మాత్రమే తగినవనే తలపు నన్ను ఉసిగొల్పగా నీకు కానుకగా ఆ జవ్వనిని ఇవ్వాలని నేను ప్రయత్నించాను.

కానీ, నా ప్రయత్నాన్ని క్రూరుడైన లక్ష్మణుడు వమ్ము చేసి నా అవయవాలు ఖండించి నన్ను విరూపను చేశాడు.

ఆ సుందరిని చూశావా ఇక అంతే సంగతులు, మన్మథుడి బాణాలు నీ ప్రాణాలు తోడేస్తాయి!

లే! ఇక ఆలస్యం చేయకు, నీ కుడి పాదం ఇప్పుడే ఎత్తు! (బయలుదేరు). ఆవిడని ఎత్తుకొనిరా! అని తొందర చేసింది శూర్పణఖ.

శూర్పణఖ చెప్పిన విషయం పూర్తిగా విన్నాడు, మంత్రులందరినీ వెళ్లిపొమ్మన్నాడు.

తాను ఏమి చేయాలో దీర్ఘంగా ఆలోచించి, గుణ దోష విచారణ పూర్తిగాచేసి చేయవలసిన పనిగురించి ఒక అవగాహనకు వచ్చి వాహనశాలకు చేరుకున్నాడు.

రథాన్ని సిద్ధం చేయమని సారథికి ఆజ్ఞ ఇచ్చాడు.

సారథి అతిశీఘ్రంగా రత్నాలంకార భూషితమైన రథాన్ని సిద్ధం చేశాడు, దానికి శ్రేష్ఠమైన గాడిదలు కట్టబడ్డాయి, వాటి ముఖాలు పిశాచాల ముఖాలులాగా ఉన్నాయి.

ఆ రథాన్ని ఎక్కి రావణుడు సముద్ర తీరం వైపుగా వెళ్ళాడు.

పది ముఖాలు, ఇరువది భుజాలు, పది కంఠాలు, పది శిరస్సులతో వైఢూర్యం వంటి నిగనిగలతో స్వర్ణాభరణ భూషితుడై ఆకాశమార్గాన ప్రయాణం చేస్తుంటే చూసేవారికి కొంగలతో కూడిన నల్లటి మేఘంలాగా కనపడ్డాడట.

ఆ తీరమంతా నయనమనోహరంగా ఉంది. వివిధ వృక్ష జాతులు, ఎన్నో రకాల పక్షులు, గంధర్వులు, మునులు, దేవతలు, అప్సరసలు మొదలగు వారిచేత శోభాయమానంగా ఉంది. ఆ సముద్రాన్ని దాటి ఆవలివైపుకు వెళ్ళాడు రావణుడు.

.. (సశేషం)

# కంచే.. చేను మేస్తే?..



ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ నివాసంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిన నోట్ల కట్టలు దొరికాయన్న వార్త దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఆ నోట్ల కట్టలు ఎక్కడి నుంచి వచ్చాయి? వాటి విలువ ఎంత అన్న విషయాలు ఇంకా బయటకురాలేదు. చట్టబద్ధమైన నగదు అయి ఉంటే న్యాయమూర్తి లేదా ఆయన కుటుంబ సభ్యుల బ్యాంకుఖాతాల్లోనో, లేదా ప్రధాన నివాసంలోనో ఉండాలి కానీ ఇలా స్టోర్‌రూంలో ఉండడమేమిటని సామాన్యులను తొలుస్తున్న ప్రశ్న. అసలు ఆ నోట్ల కట్టలకు, తమకు సంబంధం లేదని జస్టిస్ యశ్వంత్ వర్మ చెబుతున్నారు. తాను కానీ, తన కుటుంబసభ్యులు కానీ చేసే లావాదేవీలన్నీ బ్యాంకింగ్ ఛానల్స్ ద్వారా చేసేవేనని చెప్పారు. మంటలను ఆర్పిన తర్వాత అగ్నిమాపక సిబ్బంది తమకు ఆ గదిని అప్పగించినపుడు అక్కడ ఎలాంటి కాలిన నగదూ లేదని, ఎవరో కావాలని తనను అప్రతిష్ట పాలు చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. అయితే ఢిల్లీ ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టుకు సమర్పించిన ప్రాథమిక నివేదిక జస్టిస్ యశ్వంత్‌వర్మ వాదనకు భిన్నంగా ఉంది. బయటి వ్యక్తులెవరూ అనుమతి లేకుండా బలవంతంగా న్యాయమూర్తి నివాసంలో నోట్ల కట్టలు ఉంచే అవకాశం లేదని ప్రాథమిక నివేదిక స్పష్టం చేస్తోంది.

ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు మూడు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులతో త్రిసభ్య సంఘాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేశారు. ఈ సంఘం విచారణ ప్రారంభించింది. అయితే ఈ కమిటీకి నిర్ధీత గడువేమీ విధించలేదు. విచారణ పూర్తయ్యే వరకు జస్టిస్ యశ్వంత్ వర్మను విధులకు దూరంగా ఉంచారు. ఆయనను తక్షణం అలహాబాద్ హైకోర్టుకు బదిలీచేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకోగా అక్కడి బార్ అసోసియేషన్ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయింది. వెంటనే ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలుకు ఆదేశాలు జారీచేయాలని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సభలో చర్చ జరిపే అంశంపై నిర్ణయం తీసుకునేందుకు రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ వివిధ పక్షాల నేతలతో సమావేశమయ్యారు.

మనసులో మాట 38

ఈ వ్యవహారంపై పారదర్శకత కోసం ప్రాథమిక నివేదికను, కాలిన నోట్లకట్లతో ఉన్న వీడియోను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచడం మంచి విషయం. అయితే ఈ వ్యవహారంలో నిజాలను వీలయినంత త్వరగా నిగ్గు తేల్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. న్యాయవ్యవస్థపై ప్రజల్లో గౌరవం ఉంది కానీ కొన్ని విషయాల్లో అసంతృప్తి ఉందనేది కాదనలేని వాస్తవం. ముఖ్యంగా చిన్న చిన్న వ్యవహారాల్లో వేగంగా స్పందించే న్యాయవ్యవస్థ, పెద్దలుగా చలామణి అయ్యే వారిపై ఉన్న కేసుల విషయంలో అంతులేని జాప్యం చేస్తోందన్న విమర్శ ప్రజల్లో ఉంది.

తనకు కానీ, తన కుటుంబసభ్యులకు కానీ నోట్లకట్టలకు సంబంధం లేదని చెబుతున్న జస్టిస్ యశ్వంత్‌వర్మ... పారదర్శకత కోసం స్వచ్ఛందంగా ఉన్నత స్థాయి విచారణ ఎందుకు కోరడం లేదన్నది వివిధ వర్గాల నుంచి వస్తున్న ప్రశ్న. ఆయనపై అభిశంసన తీర్మానం పెట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విచారణ పూర్తికాకముందే, నిజం ఏమిటో నిగ్గు తేలకముందే అభిశంసన వరకు వెళ్లడం తొందరపాటు చర్యే అవుతుంది. అసలు న్యాయవ్యవస్థకు సంబంధించి ఇతరత్రా అంశాలు కూడా ఈ సందర్భంగా చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా వారు పదవీ విరమణ చేసిన అనంతరం చేపడుతున్న బాధ్యతలపై దేశంలో పూర్తిస్థాయి సమ్మతిలేదు. కొంతమంది న్యాయమూర్తులు పదవికి రాజీనామా చేసో లేదా పదవీ విరమణ అనంతరమో రాజకీయ పార్టీల్లో చేరడం, లేదా ప్రభుత్వ పదవుల్లో చేరడంపై ప్రజల్లో విస్తృతమైన సమ్మతి లేదు. చట్టపరంగా ఇటువంటివి తప్పు కాకపోయినప్పటికీ నైతికత విషయంలో ప్రశ్నలు తలెత్తుతాయి. న్యాయమూర్తి అంటే ఏ పక్షం వైపు మొగ్గు చూపకుండా తటస్థ వైఖరితో తీర్పు చెప్పే స్థానంలో ఉన్న గౌరవనీయ వ్యక్తి. అటువంటి వారు పదవీ విరమణ అనంతరం ఏదో ఒక పక్షం వైపు చేరారంటే పదవిలో ఉన్నప్పుడు కూడా వారికి ఆ పక్షం పట్ల ఆసక్తి ఉంది అనుకునే అవకాశం ఉంటుంది. నిజానికి భారత న్యాయవ్యవస్థ మన ప్రజాస్వామ్యానికి నిరంతర పరిరక్షకురాలిగా ఉంటోంది. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా కొన్ని చరిత్రాత్మక తీర్పులు ఇచ్చింది. రాజ్యాంగ మౌలిక సూత్రాలను కాపాడే ప్రధాన వ్యవస్థగా న్యాయవ్యవస్థ పోషిస్తున్న పాత్ర అమోఘం. ప్రభుత్వ, కార్యనిర్వాహక వ్యవస్థలు ఏకపక్షంగా వ్యవహరించకుండా పాలన వ్యవస్థను సమతౌల్యం చేయడంలో కీలక భూమిక పోషిస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే చేనుకు కంచె లాంటిది మన న్యాయవ్యవస్థ. కంచే చేను మేసే పరిస్థితి ఎప్పటికీ రాదనే దేశ ప్రజల విశ్వాసం. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఇంట్లో నోట్లకట్టలు దొరికిన వ్యవహారంపై విచారణను వేగవంతంగా, అర్థవంతంగా ముగించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# తెలుగు వైభవాన్ని చాటాలి



## • పెరసం సభలో వక్తలు

కవులు సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయాలని, ప్రాచీన సాహిత్యం నుంచి నేటి దాకా వచ్చిన అనేకరకాల కవితా రీతుల్ని అవగాహన చేసుకుని, తమదంటూ ప్రత్యేకశైలిని అలవరచుకుని కవిత్వం రాయాలని ఈనెల 23న స్థానిక రేబాల గ్రంథాలయంలో జరిగిన సభలో పలువురు వక్తలు సూచించారు. కవిత్వం సమాజాన్ని చైతన్యవంతం చేసేదిగా ఉండాలని, కవిత్వం ద్వారా కమ్మనైన మన తెలుగు భాషా వైభవాన్ని చాటాలని ఆకాంక్షించారు. ప్రముఖ కవయిత్రి పెన్నా రచయితల సంఘం (పెరసం) కార్యదర్శి తోట సులోచన తమ తల్లితండ్రులు తోట చెంచులక్ష్మమ్మ-గురుమూర్తిల స్మారకార్థం పలువురు కవులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు.. పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్, కవులు మోపూరు పెంచలనరసింహం, ఈతకోట సుబ్బారావు, మద్దూరు శ్రీనివాసులు, అవ్వారు శ్రీధరబాబు, పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, నెరసం (నెల్లూరుజిల్లా రచయితల సంఘం) ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం, ప్రముఖ కవులు నల్లు రమేష్, జడపల్లి మాధవాస్సుధ, హస్తి లక్ష్మణరాజు, కవయిత్రులు వాయుగుండ్ల శశికళ, పర్ణశాల శేషమ్మలకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. తొలుత జరిగిన కవిసమ్మేళనంలో మాటేటి రత్నప్రసాద్, మక్తాల నరేంద్ర, మునీంద్ర, ఇసనాక దయాకర్‌రెడ్డి, కుని అంకబాబు, ఇంద్రగంటి మధుసూదన్, ముసునూరు నారాయణ, పార్లపల్లి నాగేశ్వరమ్మ తదితరులతో పాటు పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కవితాగానం చేశారు.

# పాపం!.. చుక్కల దుప్పి!

## దాహార్తితో వచ్చి.. కుక్కల దాడిలో మృతి



ఎండాకాలం తీవ్రం కావడంతో కొండకోనల్లో నీళ్ళెండిపోయి వన్యప్రాణులు దాహంతో అల్లాడుతున్నాయి. నీళ్ళకోసం చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. దీంతో అవి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈనెల 23న ఉదయగిరి మండలం కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట గ్రామంలో ఓ చుక్కల దుప్పి అడవినుంచి వచ్చేసి, కుక్కల వాత పడింది. అసలే దప్పికతో గొంతెండిపోయి నీరసపడిపోయి ఉన్న ఆ దుప్పిని కుక్కలు చుట్టుముట్టి కరవడంతో ఆ దుప్పి తీవ్ర గాయాలపాలై మరణించింది. గ్రామస్తుల సమాచారంతో అటవీశాఖ అధికారులు వచ్చి మృతిచెందిన దుప్పిని పరిశీలించారు. నిబంధనల మేరకు పోస్ట్‌మార్టం చేసి, ఆ దుప్పి కళేబరాన్ని ఖననం చేశారు. ఎండాకాలం వచ్చినప్పుడల్లా అటవీ ప్రాంతాల్లో నీళ్ళు లేక ఎన్నో వన్య ప్రాణులు దాహార్తితో సమీప గ్రామాల్లోకి రావడం, రోడ్లు దాటుతున్నప్పుడు ప్రమాదవశాత్తూ చనిపోవడం, లేదా ఊళ్ళల్లో కుక్కల బారినపడి మరణించడం తరచూ జరుగుతూనే ఉంది. అటవీ అధికారులు దృష్టిపెట్టి అడవుల్లో వీలైనచోట్లలోనైనా నీటితొట్లు ఏర్పాటుచేసి నీళ్లు నింపుతుంటే వాటి ప్రాణాలు నిలబెట్టినట్లవుతుంది.

# ఉగాది ఆగమనం



జగతిన ఉన్న ప్రకృతి వసంత మాస సౌందర్య శోభను
అలరింపగా -
భూమాత పులకరించి తన ఉనికిని ఆనందింప చేయగా -

నవాభ్యుదయ శంఖారావానికి నాంది పలుకగా -
జన హృదయాలను రంజిల్ల చేయగా -
జనవాహిని ముదమున మోదము తెలుపగా -
నవ కాంతులు తోరణాలతో సప్తవర్ణ సుమమాలలతో
స్వాగత గానాలను స్తుతించగా -
ఆకులు రాల్చిన చెట్లు చిగురు టాకుల పొదుగులో
నేత్రపర్వంగా -
ఆమనిని రమ్మని పిలువగా -
కోకిలమ్మ గానామృతములో
చైత్రమాస వెలుగులో ఉగాది రాగా -
పరవసించిన వేళ
అవనిపై అణువణువు అనురాగ మధురిమలు ఒలికింపగా -
గడచిన వత్సరానికి వీడ్కోలు పలికి
రారమ్మని స్వాగతించింది శోభాయమానంగా
శ్రీ విశ్వావసు నామ సంవత్సర నామముతో.



దూబగుంట రామకృష్ణ, తిరుపతి.
చరవాణి నెంబర్. 9490108518.

### కృష్ణపట్నంలో 6 నుంచి..

# శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

కృష్ణపట్నం బేరివీధిలో కొలువైవున్న సీతాసమేత శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు శ్రీరామనవమి బ్రహోత్సవాలు జరుగనున్నాయని ఆలయ ఛైర్మెన్ యేకొల్లు మురళీబాబు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ స్వామివారికి, అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, భక్తులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# రైళ్లలో పోలీసు గస్తీని పెంచండి

## - రైల్వే డీఎస్పీ మురళీధర్

రైళ్ళలో దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు గస్తీని మరింత ముమ్మరం చేయాలని రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ ఆదేశించారు. ఈనెల 25న ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో రైల్వే అధికారులతో ఆయన మాట్లాడుతూ, రైళ్ళలోను, ప్లాట్‌ఫారాల మీద ఎక్కడా చోరీలు జరగకుండా నిఘా పెట్టాలన్నారు. నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే ఎస్‌ఐలు హరిచందన, రమాదేవి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# మహిళల అభివృద్ధే సీఎం లక్ష్యం



గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో ఇటీవల పొదుపు మహిళల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరై పొదుపు గ్రూపులు ఏర్పాటుచేసిన వివిధ రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. పొదుపు గ్రూపులకు వారి చేతులమీదుగా నగదు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. పొదుపు సంఘాలను ఏర్పాటు చేసింది, మహిళల అభివృద్ధికి నిరంతరం పనిచేసేది ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. టిడిపి నాయకులు మట్టం శ్రావణి, గుండాల లీలావతి, వెంకటేశ్వర్లు రాజు, శివకుమార్, పురుషోత్తం రెడ్డి, ఎపిఎంలు, సీసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ కిట్ల పంపిణీ



గూడూరు పట్టణంలోని షాది మంజిల్‌లో మహమ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 160 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ కిట్లను అందించారు. అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత 16 సంవత్సరాల నుండి నిరుపేద ముస్లింలకు, విద్యార్థులకు ఈ సంస్థద్వారా సేవలు అందించడం జరుగుతుందన్నారు. అబ్దుల్ రహీం, షేక్ షఫీ, బాబర్, అన్వర్, గోల్డ్ నాజర్, ఓడూరు నాజర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలను పాటించండి

## ఆటోడ్రైవర్లతో పోలీసులు







ఆటోడ్రైవర్లు నిబంధనలను పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గూడూరు టౌన్ సి.ఐ శేఖర్‌బాబు అన్నారు. రోడ్డు యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా నిబంధనలను పాటించాలని గూడూరు టవర్ క్లాక్ దగ్గర ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. గూడూరు టూటౌన్ ఎస్.ఐ సుబ్రహ్మణ్యంరాజు కోర్టు సెంటర్ సమీపాన ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. అలాగే, రూరల్ ఎస్.ఐ మనోజ్‌కుమార్ గూడూరు మండల పరిధిలోని పోటుపాలెం కూడలిలో ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని, అతివేగంగా వెళ్లకూడదని సూచించారు. వాహనాలను దాటేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్స్, యూనిఫామ్ కలిగి ఉండాలని అన్నారు.

# నిరుపయోగంగా ఎస్‌బిఐ ఏటిఎం




అవసరమైనప్పుడు వెంటనే డబ్బును డ్రా చేసుకునేందుకు అందరికీ అందుబాటులో ఏర్పాటు చేసిన గూడూరు కోర్టు సెంటర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటిఎం గత నెలరోజుల నుండి పనిచేయకుండా నిరుపయోగంగా ఉంది. దీంతో వినియోగదారులు డబ్బులు డ్రా చేసుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక్కడ కోర్టుకు వచ్చే లాయర్లు, ప్రజలు, నిమ్మ వ్యాపారస్తులు, పోలీసులు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఈ ఏటిఎం పనిచేయకపోవడంతో ఇప్పుడు వారంతా అక్కడ నుండి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో ఏటిఎంకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, కోర్టు సెంటర్‌లోనే ఎస్‌బిఐ ఏటిఎంకు ఎదురుగా కో-ఆపరేటివ్ బ్యాంక్ మొబైల్ ఏటిఎం ఉన్నా, అది అన్ని సమయాలలో అందుబాటులో ఉండడం లేదు. దీంతో వెంటనే కోర్టు సెంటర్‌లోని ఎస్‌బిఐ ఏటిఎంను ఉపయోగంలోకి తీసుకురావాలని ఎస్‌బిఐ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# దక్కిలిలో ఉచిత వైద్య శిబిరం



దక్కిలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 23వ తేదీ ఆ గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకుడు రామచంద్ర నాయుడు సహకారంతో గూడూరుకు చెందిన డాక్టర్ సందీప్‌యాదవ్ గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 150 మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. బత్తిన వంశీకృష్ణ, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ క్రీడాకారుల ప్రతిభ



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులు ఇటీవల జెఎన్‌టీయుఏ అంతర కళాశాల క్రీడాపోటీల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. కలికిరిలో నిర్వహించిన ఈ పోటీల్లో 33 కళాశాలల నుంచి సుమారు 800మంది క్రీడాకారులు పాల్గొనగా, అందులో నాలుగు క్రీడాంశాల్లో ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకరులు బహుమతులు సాధించడం విశేషం. టేబుల్ టెన్నిస్ (మెన్స్–సింగిల్స్)లో ఏ. చందు, టేబుల్ టెన్నిస్ మెన్స్–డబుల్స్‌లో ఏ.చందు, కె.వంశీధర్ రెడ్డి, టేబుల్ టెన్నిస్ ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో ఎస్.చందన, హ్యాండ్‌బాల్ మహిళా విభాగం పోటీల్లో బి. మనోప్రియ, యాన్ గాయత్రి, షేక్ నజీమ, ఐ.ఇందు వర్షిణి, వి.వెంకటసౌమ్య, బి.వర్షిత, పి. ఆర్యశ్రీ, ఏ.లోకేశ్వరి, వి.మౌనిక, పి.లక్ష్మీప్రియ బహుతులు సాధించారు.

## 12న ఆక్సియాన్ సదస్సు

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న ఆక్సియాన్ సదస్సు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఈనెల 25న కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఆ సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనేక నూతన సాంకేతిక విషయాలను ఈ సదస్సులో వివరిస్తారని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథ్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ డా.వి.శ్రీనివాసులు, కోఆర్డినేటర్లు బి.మహేశ్‌రెడ్డి, ఏ.సుప్రతీక, ఎస్‌కె షఫీ తదితరులు పాల్గొన్నారు.



# అమ్మా-నాన్న.. ఓ అబ్బాయి..

## మధ్యలో.. దీపా వెంకట్!


**ఇది నమ్మలేని నిజమైన గాథ**

**అనాథగా దొరికిన ఓ చిన్నారి వ్యథ**

**స్వర్ణభారత్ ట్రస్ట్ చొరవతో 14 ఏళ్ళ తర్వాత**

**కన్నవారి ఒడికి చేరిన నీరజ్ కథ**

*జీవితం రంగురంగుల హోళీయే కాదు..అదొక చిత్రావిచిత్రమైన వైకుంఠపాళి కూడా. ఎవరెక్కడ ఏమైపోతారో చెప్పలేం. ఎవరు నిచ్చెనలెక్కి పైకెదుగుతారో..ఎవరు పాములు మింగి అట్టడుగుకి చేరుతారో చెప్పలేం. ఔను!..జీవితం అంతే!..అలాగే ఉంటుంది. అంతా విధి ఆడే వింత నాటకం!..అయినా..ఎక్కడ ఉత్తరప్రదేశ్.. ఎక్కడ నెల్లూరు జిల్లా వెంకటాచలం?..ఏ పూర్వపుణ్య బంధమో ఆ పిల్లవాణ్ని ఇక్కడిదాకా లాక్కొచ్చింది. అదే ఆ బాలుడి జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ అనాథ బాలుడి దీనస్థితి చూసి కలత చెందిన స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్!..ఆ పిల్లవాడి జీవితానికి వెలుగునివ్వాలని నిర్ణయించుకుంది. ఇదంతా వింటే ఎంత విచిత్రమో కదా..అనిపిస్తుంది!.. అసలేం జరిగిందంటే!...*






అమ్మని కలిసిన వేళ భావోద్వేగ హేల

నెల్లూరుజిల్లాలోని గూడూరు రైల్వేస్టేషన్‌లో ఓరోజు... సుమారు 8 ఏళ్ల చిన్నపిల్లవాణ్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ఆ బుడతడు అక్కడెందుకు ఉన్నాడో..ఎక్కడినుంచి వచ్చాడో ఆ వివరాలేమీ చెప్పలేకపోతున్నాడు. చేసేదేమీ లేక పోలీసులు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహిస్తున్న బ్రిడ్జ్ స్కూల్‌లో అప్పగించారు. ఆ పిల్లవాడే..నీరజ్!..ఆ స్కూల్‌లో ఇంకా కొద్దిమంది అనాథ పిల్లలు, పేద కుటుంబాల్లో ఉంటూ, బడి మానేసిన చిన్నారులు, తల్లి లేదా తండ్రి మాత్రమే ఉన్న పిల్లలు ఉన్నారు. వారి చదువుల బాధ్యతను కూడా ఆ ట్రస్ట్‌వారే చేపడుతున్నారు. సుమారు 150 మంది బడి మానేసిన పిల్లలకు ఉచితంగా విద్య, భోజనం, యూనిఫాం, వసతి అన్నీ స్వర్ణభారత్ ట్రస్ట్ కల్పిస్తుంది. అక్కడ నీరజ్.. ఇతర పిల్లలతో కలిసి చదువుకోవడం ప్రారంభించాడు. ఓరోజు ఆ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్ ఆ బాలుడి దీనస్థితిని చూసి, తానే స్వయంగా దత్తత తీసుకుని చదువు చెప్పించింది. అంతే కాదు, ఆ చదువు పూర్తయ్యేలా చూసి, జీవితంలో ఎప్పుడైనా ఉపయోగపడతాయని ప్లంబింగ్, ఎలక్ట్రికల్, డ్రైవింగ్, వాహనాల మెకానిజం వంటి పలు నైపుణ్య శిక్షణలు కూడా ఇప్పించింది. ఇంతకీ నువ్వెక్కడి నుంచి వచ్చావు.. అమ్మానాన్నల పేరేమిటి అంటే చెప్పలేకపోతున్నాడు. ఆ బిడ్డ నెలాగైనా తల్లితండ్రుల వద్దకు చేర్చాలనే తపనతో దీపా వెంకట్ వారి గురించి ఆరా తీయడం ప్రారంభించింది. అప్పుడు తెలిసింది... అసలు కథ!..

### ఎవరికీ చెప్పాపెట్టకుండా రైలెక్కేశాడు

నీరజ్ తండ్రి పేరు పున్వాస్ కన్నొజియా. వారిది ఉత్తరప్రదేశ్. వారణాసిలోని బడేగావ్‌లో భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు వుండేవారు. అన్న ధీరజ్ చీరల డిజైనర్ వద్ద పని చేస్తుండగా, తండ్రి లాండ్రీషాపులో పనిచేసేవాడు. నీరజ్‌ని పక్కనే ఉన్న బేకరీలో పనికిపెట్టాడు. ఉపాధి కోసం తన ఇద్దరు కుమారులు ధీరజ్, నీరజ్‌తో కలిసి వారు ఓసారి ముంబై వచ్చారు. బొంబాయి చూద్దామని పట్టుబట్టిన నీరజ్‌ను నిలువరించడం తండ్రికి కష్టంగా ఉండేది, పైగా బేకరిలో వేడి వేడి పళ్ళాలు పట్టుకోవడంతో నీరజ్‌కి చేతులకి వాతలు పడేవి. ఒక రోజు మధ్యాహ్నం, తండ్రి నిద్రపోతున్న సమయంలో చెప్పా పెట్టకుండా నీరజ్ ఒక లోకల్ రైలెక్కాడు. ఆపై ముంబై సెంట్రల్ స్టేషన్‌లో మరో రైలెక్కాడు. దాదాపు రెండు నెలల పాటు వివిధ రైల్వే స్టేషన్లలో ఎక్కడంటే అక్కడ తిరుగుతూ, చివరికి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుజిల్లా గూడూరు స్టేషన్ వద్ద తిరుగుతుండగా రైల్వే పోలీసులు గుర్తించారు. ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడని వారు వెంటనే గ్రహించారు. నీరజ్ కేవలం హిందీ మాట్లాడగలిగేవాడు. ఆ పిల్లవాడి కుటుంబం గురించి తెలుసుకునేందుకు ప్రయత్నించి విఫలమవడంతో, రైల్వే పోలీసులు నీరజ్‌ను వేంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్‌కి అప్పగించారు. దీంతో, ఆమె నీరజ్‌ను బ్రిడ్జ్ స్కూల్‌లో చేర్చారు. అక్కడే తెలుగు నేర్చుకున్నాడు. హాస్టల్‌లోనే ఉండి, ఇతర విద్యార్థులతో కలిసి చదువుకుంటూ, పండుగలు కూడా అక్కడే జరుపుకుంటూ ఉండేవాడు. ఆ తర్వాత శ్రీమతి దీపా వెంకట్.. మరో ఐదుగురు అనాథ బాలికలను దత్తత తీసుకున్నారు. వారంతా నీరజ్‌ను అన్నయ్యలా భావించి రక్షాబంధన్ రోజున రాఖీలు కట్టేవారు. అక్కయ్య వున్నా..ఎక్కడుందో తెలియదు. ఇదొక (విధి ఒక) విచిత్ర పరిస్థితి!.. అయితే, నీరజ్ ఎవరో తెలుసుకునేందుకు, నీరజ్ కుటుంబాన్ని గుర్తించేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా, నీరజ్ చెప్పిన సమాచారంతో వారి ఆచూకీ దొరకలేదు. అక్టోబర్ 2024లో మేనేజింగ్ ట్రస్టీ కార్యాలయం వారు, ముంబై కురార్ పోలీసులకు సమాచారాన్ని అందించినా, పెద్దగా పురోగతి కనబడలేదు. కారణం, ఆధార్ కార్డులో నీరజ్ ఇంటి పేరు సరిగ్గా నమోదు కాకపోవటం!

### ఎట్టకేలకు..నాన్న పనిచేసిన స్థలాన్ని గుర్తించాడు

నీరజ్ తల్లితండ్రుల ఆచూకీని వెదికే కార్యక్రమంలో భాగంగా.. హెూళీ పండుగకు ఒక రోజు ముందు దీపా వెంకట్ తమ ట్రస్ట్ ప్రతినిధిని నీరజ్‌తో జత కలిపి ముంబై, మలాడ్ ఈస్ట్‌లో వెతకడానికి పంపించారు. కురార్‌కు చేరుకున్నాక, అదృష్టవశాత్తూ నీరజ్ తన తండ్రి పనిచేసిన ప్రదేశాన్ని గుర్తించాడు. ఆయన పని చేసిన బేకరీ, పక్కనే ఉన్న చెరుకు రసం దుకాణం కనిపించాయి. ఎట్టకేలకు వారి ఆచూకీ లభించింది. అదేరోజు సాయంత్రం నీరజ్‌కు వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. స్క్రీన్‌పై తమ కుటుంబ సభ్యులు ఒకరినొకరు చూసుకున్న మరుక్షణం.. మాటల్లో చెప్ప లేనంత సంతోషం. నీరజ్‌ను చూసి తల్లి ఉద్వేగంతో కన్నీళ్లు పెట్టుకుంది, తండ్రి ఆనందానికి అంతులేదు, అవ్వ ఆనందబాష్పాలు రాల్చింది, తమ్ముళ్లు తబ్బిబ్బయ్యారు. అక్కలు కూడా ఫోన్‌చేసి మాట్లాడగా, దుబాయ్‌లో పని చేస్తున్న అన్నయ్య ధీరజ్ కూడా వీడియో కాల్ ద్వారా మాట్లాడాడు. 14ఏళ్ల తర్వాత, నీరజ్ తన కుటుంబాన్ని తిరిగి కలుసుకోవడం...ఎంత అద్భుతమో కదా!..

### నిజంగా ఇదేమీ కథ కాదు..నిజమైన జీవితం!..

అయితే ఇదేమీ కథ కాదు..పచ్చి నిజం. ఎవరి బిడ్డో..ఏమైపోతే మనకేం..అని అందరూ అనుకోలేరు. దీపావెంకట్ వంటి మాన వీయమూర్తులు ఇంకా సమాజంలో ఉన్నారు. వారే రేపటికి ఈ సమాజానికి దారిదీపాలు కూడా. నీరజ్ తన కుటుంబాన్ని ఫోన్ ద్వారా కలుసుకున్నాడని తెలుసుకున్న దీపావెంకట్ కూడా..వారి కుటుంబసభ్యురాలిలా ఎంత సంతోషించారో చెప్పలేం. తల్లి హృదయానికి ఎల్లలు ఉండవు కదా!.. ఆ సమయంలో ఆమె వారణాసిలోనే ఉండటంతో, ముంబై నుంచి నీరజ్‌ను, ట్రస్ట్ ప్రతినిధితో అప్పటికప్పుడు విమానం టిక్కెట్లు బుక్ చేసి వారణాసి పిలిపించడం ఎంత గొప్ప విషయం?.. నీరజ్ విమానాశ్రయం బయట అడుగుపెట్టగానే, తండ్రి పోలికలతో



నీరజ్ కుటుంబసభ్యులుతో దీపా వెంకట్

ఉన్న నీరజ్‌ను.. కుటుంబసభ్యులు వెంటనే గుర్తించారు. తల్లి, తండ్రి, ఇద్దరు తమ్ముళ్లు, అక్క గట్టిగా అందరూ కౌగిలించుకుని కంటతడిపెట్టారు. వారి చిన్న నాటి జ్ఞాపకాలన్నీ గుర్తుచేసుకుని ఆనందించారు. తన కుమారుడిని 14 ఏళ్ల పాటు కన్నతల్లి లాగా పెంచి, జీవితంలో ఆ బిడ్డకు సరైన మార్గాన్ని చూపించినందుకు నీరజ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు.. స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌కు ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు. “నీరజ్ బ్రతికే ఉన్నాడని మేము అనుకోలేదంటూ!’.. వారు నీరజ్‌ను కౌగిలించుకున్నారు. ఆ తర్వాత దీపావెంకట్‌ను వారు బడేగావ్‌లో ఉన్న తమ ఇంటికి ఆమె బృందంతో కలిపి ఆహ్వానించారు కూడా. కన్నబిడ్డ కనబడకుండా పోతే..ఏళ్ల తర్వాత మళ్ళీ కనిపిస్తే... ఇలాంటి సంఘటనల్లో ఆ తల్లుల హృదయస్పందనలకు మాటలుండవు. వారి ఆనందానికి అవధులండవు.

అందుకే ఆ రోజు..రంగుల పండుగ హోలీ రోజు..ఆకాశమే హద్దుగా.. అంతులేని ఆనందం వెల్లువెత్తిన రోజు!.. వారందరికీ ఆ రోజు..ఓ మరపురాని మధురజ్ఞాపకంగా మారిన రోజు!..



### ఇరుకళలమ్మ దేవాలయంలో..

# 30న ఉగాది ఉత్సవం

### ఆహ్వానపత్రికలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు గ్రామదేవత, మూలాపేటలో చెరువుగట్టున వెలసివున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 30న శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవం వైభవంగా జరుగనుంది. ఉత్సవ ఆహ్వానపత్రికలను ఈనెల 23న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, ఉత్సవ కమిటీ ఛైర్మెన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖరస్వామి పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా.. శ్రీనివాసులు

ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇ.డి)గా బాలసాని శ్రీనివాసులు ఈనెల 25న నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్న ఆయనకు ఎస్సీ కార్పొరేషన్ ఇ.డిగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

## శ్రీ విశ్వావసు వస్తుంది!



ఎన్ని అణగారిన జీవితాల
వ్యధలో
కన్నీటి సంద్రాల కడలి కెరటాల
క్రీనీడల్లో నలిగి
అలిసి సొలసి
ఉషస్సుకై పరితపిస్తున్నాయి
ఎన్ని ఆశలు కూలిన సౌధాల్లో
వంచనాశిల్పంతో
చేతికందని చందమామను
కలతచెంది
కన్నీళ్ళ ప్రవాహంలో క్రీగంట చూస్తున్నాయి
ఏవీ ఆ కాంతులేవీ
శిథిలాల్లో పూచిన ఉదయాలేవీ
రాజ్యం నిర్దాక్షిణ్యంగా వాటిని
సంహరిస్తుంటే
వేణువుపాడే కోకిల స్వరం విన్పిస్తుందా
ఆకలి కేకల లోకంలో
ఆశలపల్లకి చిగురిస్తుందా?
ఉదయ కిరణాలు
సిఐడిలై వెంటబడ్తుంటే
నా తోటలో ఎగరని
సీతాకోక చిలుకల కోసం
కన్నెర్ర చేస్తుంటే
వసంత ఋతువు ఎలా ప్రభవిస్తుంది..
నా నేత్రాల కాలువల్లో
స్వప్నాలు తేలియాడుతుంటే
ఉగాదులెలా ప్రభవిస్తాయి.
మనిషి పక్షిలా బతకాలి
ఒంటెలా ఊరేగాలి
రేపటి గాలిని ముందే పీల్చే
చేవతో బ్రతకాలి
అప్పుడే నిర్మలాకాశపు
రేవులో
విశ్వావసు ఓడ చేజిక్కుతుంది.
మనల్ని ఒడ్డుకు చేరుస్తుంది.
జీవితం జీవించడంలోనే కదా
అందం ద్విగుణీకృతమవుతుంది!



**చిన్ని నారాయణరావు**
94402 02942

- శ్రీసిటీ-కెలాగ్స్ వితరణ

# ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతుల కల్పన



పిల్లలకు చదువుతో పాటు ఆటలు ఎంతో ముఖ్యమని శ్రీసిటీ ఫౌండేషన్ వారు క్రీడలకు తమవంతు ప్రోత్సాహాన్ని అందజేస్తున్నారు. శ్రీసిటీలోని పరిశ్రమల సహకారంతో శ్రీసిటీ పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, విద్యార్థులకు అనేక రకాల క్రీడా వసతులను కల్పిస్తున్నారు. ఇటీవల శ్రీసిటీ పరిధిలోని మాదనపాలెం, ఇరుగుళం జడ్పీ హైస్కూళ్ళు, రామచంద్రపురం, గొల్లవారిపాలెం, నెల్లూరు ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా క్రీడా వసతులను కెలాగ్స్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేశారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు 8 లక్షల రూపాయలు వెచ్చించి, చిన్నపిల్లలు ఎంతో ఇష్టంగా ఆడుకునే ఊయల, జారుడుబండ, తిరుగుడు బల్ల (మెర్రిగో), సీస వంటి రకరకాల ఆట వస్తువులను అమర్చారు. అలాంటి క్రీడా వసతుల ఏర్పాటు కావడంపట్ల ఆయా పాఠశాలల సిబ్బంది, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం



నెల్లూరు, 46వ డివిజన్ పరిధిలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో ఇటీవల కొత్తగా విజయ డెయిరి పార్లర్ ప్రారంభమైంది. డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో కలిసి శాసన మండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దీనిని ప్రారంభించారు. 50వ డివిజన్ కార్పొరేటర్ జయలక్ష్మి విజయ డెయిరి పార్లర్‌ను ఏర్పాటు చేశారు. పర్వతరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పాల పదార్థాలను అందించడంలో విజయ డెయిరి అగ్రస్థానంలో ఉందన్నారు. కొండ్రెడ్డి సారథ్యంలో నెల్లూరు విజయ డెయిరీ ప్రజల మన్ననలు పొందడం సంతోషకరమన్నారు. కార్పొరేటర్ వేలూరు మహేష్, డెయిరి మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, మాజీ ఏఎంసి ఛైర్మన్ కోటేశ్వరరెడ్డి, ప్రసన్న, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఎంపీ జాతీయ కార్యవర్గసభ్యునిగా.. వేణుగోపాల్



నెల్లూరుకు చెందిన శాఖవరపు వేణుగోపాల్ పీఎంపీల సంఘం జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (పీఎంపీ) వెల్ఫేర్ అసోసియేషన్-న్యూఢిల్లీలో ఈనెల 25న నిర్వహించిన సమావేశంలో, పీఎంపీల సంఘం-నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా వేణుగోపాల్‌కి జాతీయస్థాయి కార్యవర్గ సమావేశంలో ఈ గుర్తింపునివ్వడం విశేషం. ప్రభుత్వం ద్వారా నిర్వహించే ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లోనూ, సమాజ సేవలోనూ ఆయన పాల్గొంటూ ప్రజలకు తనవంతు సేవలందిస్తుండడాన్ని జాతీయ పీఎంపీ నాయకులు ముకేష్ అగర్వాల్ తదితరులు కొనియాడారు.

# అలరించిన 'వేద విజ్ఞాన వేదిక' సభ



చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో, టీ-నగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ప్రతి మాసం జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలు సాహిత్యాభిమానులందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 23న 159వ ప్రసంగంగా వారు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ఆచార్యులు డా. రెంటాల శ్రీవేంకటేశ్వరరావు (రాజమండ్రి) పాల్గొని 'పానుగంటి వారి విశ్వరూపం-సాక్షి' అనే అంశంపై ప్రసంగించారు. 1910-30 ప్రాంతాల్లో పానుగంటివారు రచించిన సాక్షి వ్యాసాల్లో హాస్యం, వ్యంగ్యం, ఆర్తి, జ్ఞాన సంపద వంటివన్నీ ఉన్నాయని, అవి పాఠకులను మంత్రముగ్ధులను చేస్తాయని ఆయన వివరించారు. అప్పట్లోనే సాక్షి వ్యాసాలు ప్రజలకు చైతన్యదీపికలుగా ఉండేవని, పాశ్చాత్య నాగరికతను వ్యతిరేకిస్తూ ఆయన కలం ఝుళిపించారని చెప్పారు. తొలుత వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జెకె రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు సంయుక్తంగా డా. రెంటాల దంపతులను ఘనంగా సన్మానించారు. జెకె రెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. పెద్దసంఖ్యలో సాహిత్యాభిలాషులు పాల్గొన్నారు.

## టూకీగా...



### ముదివర్తిలో ముస్లిమ్‌లకు ఇఫ్తార్ విందు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని విడవలూరు మండలం ముదివర్తి గ్రామంలోని మసీదులో ముస్లిమ్ సోదరులకు ఈనెల 23న ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. తొలుత, ప్రార్థనలు చేసి, ఇమామ్‌లకు కొత్త దుస్తులను బహూకరించారు. టీడీపీ మండల ఇన్‌ఛార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, పురంధర్‌రెడ్డి, సత్యంరెడ్డి పర్యవేక్షించారు.

### చిరమనలో..చిన్నారులకు దంత పరీక్షలు

అనుమసముద్రంపేట మండలం చిరమన గ్రామంలో ఈనెల 25న దంత వైద్యాధికారిణి సుమిత్రవర్ధిని ఆధ్వర్యంలో, అంగన్‌వాడీ చిన్నారులకు దంతపరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణపట్ల వారికి అవగాహన కలిగించారు. రోజూ రెండు సార్లు.. ఉదయం, రాత్రి అన్నం తిన్నతర్వాత పళ్ళు శుభ్రం చేసుకోవాలన్నారు. వైద్యాధికారిణి జ్యోతిరాణి పాల్గొన్నారు.

### జి.కొండారెడ్డిపల్లిలో ఉపాధి పనుల పరిశీలన

వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఇటీవల ఏపీఓ ఆజంఖాన్ పరిశీలించారు. మస్టర్‌లను తనిఖీచేసి, ఫీల్డ్ అసిస్టెంట్లకు తగు సూచనలిచ్చారు. పనులకు హాజరైన కూలీలతో మాట్లాడారు. ఈ మండే ఎండల్లో కూలీలు జాగ్రత్తగా ఆరోగ్యం కాపాడుకోవాలని, పనికి తగ్గ వేతనం కాబట్టి, కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు.

### కోడూరులో ఉచిత వైద్యశిబిరం

తోటపల్లిగూడూరు మండలం కోడూరు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఇటీవల వైద్యనిపుణులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులిచ్చారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆశ్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### లేగుంటపాడులో టీకాలు కేంద్రం తనిఖీ

కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని టీకాలు కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కె.ఉమామహేశ్వరి ఇటీవల తనిఖీచేశారు. నిబంధనల మేరకు టీకాలు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని, బాలింతలకు రక్తహీనత రాకుండా, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు చెప్పారు.

### మల్లూరులో ఎన్ఎస్ఎస్ సేవలు

ముత్తుకూరులోని ప్రభుత్వ మత్స్య కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణులు త్రివేణి, శ్రీవిద్యల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల మల్లూరు గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి, ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలు కలుగుతాయని ప్రజల్లో అవగాహన కలిగించారు.

### పోతుకొండపై అంకాళమ్మకు విశేష పూజలు

రాపూరు మండలంలోని పోతుకొండపై కొలువైవున్న శ్రీ పోతుకొండ అంకాళమ్మతల్లి దేవాలయంలో ఈనెల 23న విశేషపూజలు నిర్వహించారు. రాపూరు ప్రాంతం నుంచే కాక, జిల్లావ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### దామరమడుగులో భగత్‌సింగ్ వర్ధంతి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవవీరుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 23న బుచ్చి మండలం దామరమడుగు గ్రామంలో ఘనంగా జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, గ్రామ కార్యదర్శి ఓంకార్, స్థానిక ప్రముఖులు పాల్గొని నాటి యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పోరాటపటిమను వివరించారు.

### అల్లూరు పోలేరమ్మకు అభిషేకాలు

అల్లూరు గ్రామదేవత.. శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 24న అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం పల్లకిసేవ జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




## బడుగుప్రజల సమస్యలపై గళమెత్తిన..బీఎంఆర్!

'బహుజన యుద్ధ నౌక'గా పేరెన్నికగన్న అపూరి సోమన్న ఆధ్వర్యంలో ఈనెల 26న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన సభలో రాజ్యసభ సభ్యులు..మన నెల్లూరీయులు బీద మస్తాన్‌రావుయాదవ్ పాల్గొని బడుగు బలహీనవర్గాలు, దళిత ప్రజల గొంతుక వినిపించారు. వారెదుర్కొంటున్న సమస్యలపై గళమెత్తారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, లోక్‌సభ సభ్యులు ఈటెల రాజేందర్‌తో పాటు పలు రాష్ట్రాల నుండి దళిత నాయకులు పాల్గొన్నారు.

### జపాన్ పెట్టుబడులకు..

# శ్రీసిటీయే అనుకూల వేదిక!

**ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి**



భారతదేశంలోని జపాన్ రాయబారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఈ.డి.బి), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్.ఐ.సి.సి.ఐ) సంయుక్తంగా, "పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంబంధాలు మరియు విద్య' అనే అంశాలపై నిర్వహించిన సెమినార్ ఈనెల 26న విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. జపాన్-ఆంధ్రప్రదేశ్ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఈ సమావేశం ఒక వేదికగా నిలిచింది. ఈ సదస్సులో భారత్‌లోని జపాన్ రాయబారి ఓనో కెయిచీ, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు మరియు వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి తదితర ముఖ్యులు పాల్గొన్నారు.ఎఫ్.ఐ.సి.సి.ఐ డిప్యూటీ సెక్రెటరీ జనరల్ డా. గుణవీనా చద్దా సారధ్యంలో, విశ్వసముద్ర హోల్డింగ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సి.ఈ.ఓ జితేంద్ర నిమ్మగడ్డ అతిథులకు స్వాగతం పలికారు. జపాన్ రాయబారి ఓనో కెయిచీ మాట్లాడుతూ, భారత దేశంతో జపాన్ వ్యాపార సంబంధాలను ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. శ్రీసిటీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక సహకారాన్ని మరింతగా పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్-జపాన్ కనెక్ట్ విధానం ద్వారా జపనీస్ కంపెనీలను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను ఆయన వివరించారు.

### రెండో అతిపెద్ద జపనీస్ టౌన్‌షిప్..శ్రీసిటీ:

జపాన్-భారత సంబంధాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న వ్యూహాత్మక నిర్ణయాలను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. శ్రీసిటీ ప్రస్తుతం భారతదేశంలో రెండో అతిపెద్ద జపనీస్ టౌన్‌షిప్‌గా రూపుదిద్దుకుందని తెలియజేశారు. ప్రస్తుతం ముప్పై ఒక్క జపనీస్ కంపెనీలు శ్రీసిటీలో అధునాతన ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాయని వివరించారు. నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, స్థిరమైన పారిశ్రామికీకరణ వంటి అంశాల్లో శ్రీసిటీ ప్రధానపాత్ర పోషిస్తోందని, తద్వారా స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. దక్షత గల నాయకత్వం, విదేశీ పెట్టుబడుల కోసం స్నేహపూర్వక వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక భౌగోళిక స్థానం, మొదలగు కారణాల వల్ల పెట్టుబడులకు రాష్ట్రం కీలక గమ్యంగా మారిందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దార్శనిక నాయకత్వాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. జపాన్-ఆంధ్రప్రదేశ్ మధ్య పెట్టుబడుల విస్తరణ, ప్రజల మధ్య సంబంధాల అభివృద్ధి, విద్య, మౌలిక సదుపాయాలు, సాంకేతికత రంగాల్లో కొత్త అవకాశాలను అన్వేషించే దిశగా తాము కట్టుబడి పని చేస్తున్నట్లు ఆయన వెల్లడిస్తూ ఈ సదస్సు ముగిసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్, భారతదేశంలోని జపాన్ వ్యాపార కేంద్రంగా మరింతగా ఎదుగుతుందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

### దైన్యమైన జీవితాల్లో ధైర్యాన్ని నింపుతున్న

# దీనజన బాంధవుడు.. వేమిరెడ్డి!

**- కొనియాడిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి -**



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) విశాలమైన మనసు గల గొప్ప సేవాతత్పరులని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొనియాడారు. ఈ నెల23న ఆత్మకూరు పట్టణంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.60 లక్షలు విలువచేసే 150 విద్యుత్ మోటార్ ట్రై సైకిళ్ళను మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కలసి పంపిణీ చేశారు.

అనంతరం మంత్రి ఆనం విలేకర్లతో మాట్లాడుతూ, నెల్లూరు పార్లమెంటు చరిత్రలోనే ఇలాంటి సువర్ణ ధ్యాయానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. జిల్లాలో ఎంతోమంది పెద్ద పెద్ద వ్యాపారస్తులు ఉన్నప్పటికీ విశాలమైన ఆలోచనా దృక్పథం, సేవాస్ఫూర్తి ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా ఉండడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. ప్రభాకర్‌రెడ్డి ఔదార్యం ముందు దివ్యాంగులు తమ బాధలు కూడా మర్చిపోయారని, ఆత్మకూరులో 150 మంది వికలాంగులకు ట్రై సైకిళ్లను ఆయన సహకారంతో అందించడం గొప్ప విశేషమని అన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి ట్రై సైకిల్ అందని వారుంటే వారికి కూడా అందించాలని వేమిరెడ్డి వారి సిబ్బందికి సూచించినట్లు మంత్రి ఆనం పేర్కొన్నారు. గొప్ప మనసుతో ఇంతటి మంచి కార్యక్రమాలను చేపడుతున్న వేమిరెడ్డికి జిల్లా ప్రజానీకం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

### ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు - విపిఆర్

విపిఆర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు సహాయం అందించడం తనకెంతో ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. తాము ఎన్నికల సమయంలో గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు చాలామంది వికలాంగులు తన వద్దకు వచ్చి గ్రామాలకు వాటర్ ప్లాంట్స్ ఇస్తున్నారు కదా, అదేవిధంగా తమకు కూడా ట్రై సైకిళ్లు అందించాలని కోరారని, వారి కోరిక మేరకు జిల్లా వ్యాప్తంగా వారికెంతో అవసరమైన ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కోవూరులో 250, ఉదయగిరిలో 150, కందుకూరులో 150, ఆత్మకూరులో 150 ట్రై సైకిళ్లు అందించామని, త్వరలోనే మిగిలిన మూడు నియోజకవర్గాల్లో కూడా అందిస్తామన్నారు. ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ట్రై సైకిళ్లు అందుకున్న ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి పలకరించినపుడు వారిలో కలిగే ఆనందం తమకు ఓ మధురానుభూతిగా ఉందన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.








Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com